
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
గురువారం 18 ఏప్రిల్ 2024





నక్కపల్లి మండలం ఉపమాక మెరకవీధి రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

కన్నుల పండువగా సీతారాముల కల్యాణోత్సవం

సీతారాముల కల్యాణ మహోత్సవాలను జిల్లా అంతటా బుధవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయాల్లో సీతారాముల ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, పసిడి ఆభరణాలతో వధూవరులుగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. రామాలయాలన్నీ 'జై శ్రీరామ్' నినాదాలతో మార్మోగాయి. అనకాపల్లిలో ఉత్సవమూర్తులను రథంపై వుంచి శోభయాత్ర నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రానున్న ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులు పలుచోట్ల సీతారాముల కల్యాణవేడుకల్లో పాల్గొన్నారు.

మాడుగుల టీడీపీ అభ్యర్థి మార్పు?

- పైలా ప్రసాదరావు స్థానంలో మాజీ మంత్రి బండారుకు అవకాశం
- ఫోన్ చేసి చెప్పిన అధినేత చంద్రబాబు
- ఒకటి, రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటన



బండారు సత్యనారాయణమూర్తి

అనకాపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): **తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మాడుగుల నుంచి పోటీ చేయడం దాదాపు ఖాయమైంది. అధినేత చంద్రబాబునాయుడు బుధవారం సాయంత్రం స్వయంగా బండారుకు ఫోన్ చేసి చెప్పారు. దీంతో బండారు సత్యనారాయణమూర్తి, ఆయన అనుచరులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే బండారు పేరును ఒకటి రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాల సమాచారం.**

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు బండారు సత్యనారాయణమూర్తి 1989 నుంచి గత పర్యాయం వరకు అన్ని అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. పరవాడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరుసగా మూడుసార్లు (1989, 1994, 1999), పెందుర్తి నుంచి 2014లో టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2004లో పరవాడ, 2009, 2019లో పెందుర్తి నుంచి ఓటమి చవిచూశారు. పెందుర్తి నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జిగా వున్న ఆయన ఈసారి కూడా ఇక్కడి నుంచి పోటీ చేయాలని భావించారు. అయితే పొత్తులో భాగంగా ఈ సీటును జనసేనకు కేటాయించారు. ఆ పార్టీ తరఫున మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పేరును అధినేత పవన్‌కల్యాణ్ ఇప్పటికే ప్రకటించారు. దీంతో బండారు అసంతృప్తి చెందారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా వుంటూ వచ్చారు. కాగా ప్రజాగళం సభలో పాల్గొనేందుకు గత ఆదివారం విశాఖ వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును విమానాశ్రయంలో బండారు కలిశారు. తనకు మాడుగుల నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన చంద్రబాబు.. ఇప్పటికే మాడుగుల అభ్యర్థిగా ప్రకటించిన పైలా ప్రసాదరావుకు నచ్చజెప్పి, బండారుకు మాడుగుల టికెట్ ఇవ్వాలని నిర్ణయించినట్టు పార్టీ వర్గాల సమాచారం. ఈ మేరకు ఒకటి, రెండు రోజుల్లో అధికారింగా బండారు పేరును ప్రకటిస్తారని తెలిసింది.

ఎన్నికలకు నగారా



నేడు నోటిఫికేషన్ జారీ
ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లు స్వీకరణ

అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నామినేషన్ల స్వీకరించే ఆర్వో కార్యాలయం

- అనకాపల్లి ఎంపీ స్థానానికి కలెక్టరేట్‌లో..
- పాయకరావుపేట అసెంబ్లీకి నక్కపల్లి తహసీల్దారు కార్యాలయంలో స్వీకరణ
- మిగిలిన చోట్ల అసెంబ్లీ నియోజకవర్గం కేంద్రాల్లోనే...
- 25వ తేదీ వరకు నామిషన్లు దాఖలుకు అవకాశం
- 26న పరిశీలన, ఉపసంహరణకు 29వ తేదీ వరకు గడువు

అనకాపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో మరో ఘట్టం ప్రారంభం కానున్నది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి గురువారం నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. ఎన్నికల కమిషన్ గతంలో విడుదల చేసిన షెడ్యూల్, ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆధ్వర్యంలో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తిచేశారు. అనకాపల్లి జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులను(ఆర్‌ఓ)లను ఇప్పటికే నియమించారు. నామినేషన్లు స్వీకరించే కేంద్రాలను కలెక్టర్ ఇప్పటికే పరిశీలించారు.

గురువారం ఉదయం 11 గంటలకు కేంద్ర ఎన్నికల సంఘం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే జిల్లాలో నామినేషన్ల స్వీకరణకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెల 25వ తేదీ వరకు (21వ తేదీ ఆదివారం మినహా) మిగిలిన అన్ని రోజుల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు రిటర్నింగ్ అధికారులు నామినేషన్ పత్రాలను స్వీకరిస్తారు. 26వ తేదీన నామినేషన్ పత్రాల పరిశీలన, 27వ తేదీ నుంచి 29వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్‌ల ఉపసంహరణకు గడువు వుంది. కాగా పోటీ చేసే అభ్యర్థి లేదా అతను/ ఆమె ప్రతిపాదించిన వ్యక్తి ఎవరైనా రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేయవచ్చు. ఆన్‌లైన్‌లో ... మిగతా 8వ పేజీలో

నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు ఇవే...

నియోజకవర్గం	స్వీకరణ కేంద్రం
అనకాపల్లి	జీవీఎంసీ మీటింగ్ హాలు, గుండాల జంక్షన్, గాంధీనగరం
చోడవరం	తహసీల్దారు కార్యాలయం, చోడవరం
మాడుగుల	తహసీల్దారు కార్యాలయం, మాడుగుల
నర్సీపట్నం	ఆర్డీఓ కార్యాలయం, నర్సీపట్నం
పాయకరావుపేట	తహసీల్దారు కార్యాలయం, నక్కపల్లి
ఎలమంచిలి	తహసీల్దారు కార్యాలయం, ఎలమంచిలి
అనకాపల్లి ఎంపీ	జిల్లా కలెక్టరేట్, అనకాపల్లి

అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ఫోన్ నంబర్లు

నియోజకవర్గం	ఆర్వో	ఫోన్ నంబర్
అనకాపల్లి	ఎం.జాహ్నవి	77028 96799
చోడవరం	ఎ.జి.చిన్నికృష్ణ	89782 81888
మాడుగుల	బి.వి.సత్యవేణి	91003 84699
నర్సీపట్నం	హెచ్‌వీ జయరామ్	78939 64954
పాయకరావుపేట	కె.గీతాంజలి	83330 25635
ఎలమంచిలి	కె.మనోరమ	99593 33477



జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నుంచి బీ ఫారాలు అందుకుంటున్న (కుడి నుంచి ఎడమకు) కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయకుమార్

జనసేన అభ్యర్థులకు బీ ఫామ్‌లు పంపిణీ

అనకాపల్లి లోక్‌సభ స్థానం పరిధిలో కూటమి నుంచి జనసేన తరఫున పోటీ చేస్తున్న కొణతాల రామకృష్ణ (అనకాపల్లి), పంచకర్ల రమేశ్‌బాబు (పెందుర్తి), సుందరపు విజయకుమార్ (ఎలమంచిలి)లకు అధినేత పవన్ కల్యాణ్ బుధవారం పార్టీ ప్రధాన కార్యాలయంలో బీఫామ్‌లు అందజేశారు.

జన కేతనం

- దేశం కంచుకోట సాత్
- అక్కడ నుంచి ఏడు సార్లు ఎమ్మెల్యేలు
- నాడు నియోజకవర్గ కేంద్రంగా రేవిడి

·7లో

చెట్టును ఢీకొన్న బైక్

ఇద్దరు యువకులు మృతి

- మరొకరికి తీవ్రగాయాలు
- పెదకోట పంచాయతీ చటాకంబ నుంచి జీనబాడు పంచాయతీ పెదగంగవరం వెళుతుండగా ప్రమాదం



సంఘటన స్థలంలో మృతిచెందిన సోమెల నాగరాజు, మామిడి రవి

దేవరాపల్లి/ అరకులోయ, ఏప్రిల్ 17: **అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పినకోట పంచాయతీ వెలగలపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. ఈ ఘటనలో మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.**

అనంతగిరి మండలం పెదకోట పంచాయతీ చటాకంబకు చెందిన సోమెల నాగరాజు (25), మామిడి రవి(18), గెమ్మెల శివాజీ అలియాస్ రాజు (17)లు జీనబాడు పంచాయతీ పెదగంగవరంలో టెంట్ హౌస్, లైటింగ్ పనుల కోసం బుధవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. పినకోట పంచాయతీ వెలగలపాడు వద్దకు వచ్చే సరికి మలుపు వద్ద బైక్ అదుపు తప్పి చెట్టును బలంగా ఢీకొన్నది. అంతటితో ఆగకుండా లోయలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో బైక్ నడుతున్న సోమెల నాగరాజు, వెనుక కూర్చున్న వారిలో మామిడి రవి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. మధ్యలో కూర్చున్న గెమ్మెల శివాజీ(17)కి తీవ్రగాయాలయ్యాయి. ఇతనిని పినకోట పీహెచ్‌సీ అంబులెన్స్‌లో దేవరాపల్లి తీసుకువచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం 108 అంబులెన్స్‌లో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మృతుల్లో నాగరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం జిల్లా ఎస్.కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, క్షతగాత్రుడు శివాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాము తెలిపారు.

కలగానే ఫిష్ ల్యాండింగ్ సెంటర్

రెండేళ్లు దాటినా మొదలుకాని పనులు
అటవీ శాఖ నుంచి భూమి బదలాయింపులో ప్రభుత్వం విఫలం

- రాజయ్యపేట వద్ద ఎఫ్ఎల్‌సీ నిర్మిస్తామని నాలుగున్నరేళ్ల క్రితం వైసీపీ పాలకులు ఆర్భాటంగా ప్రకటన
- రెండేళ్ల వరకు పట్టించుకోని ప్రభుత్వం
- అనంతరం కేంద్ర ప్రభుత్వ సిఫారసుతో చెన్నై ఐఐటీ నిపుణుల బృందం సర్వే
- ఎఫ్ఎల్‌సీ ఏర్పాటుకు ఈ ప్రాంతం అనుకూలమని నివేదిక
- రూ.24.77 కోట్ల అంచనా వ్యయం... 2022 ఏప్రిల్‌లో అనుమతి
- అటవీ శాఖ పరిధిలో సముద్ర తీర ప్రాంతం
- ఆరు ఎకరాలు మంజూరు చేయాలని కలెక్టర్ ద్వారా మత్స్య శాఖ అధికారులు లేఖ
- రెండేళ్లు కావస్తున్నప్పటికీ అటవీ శాఖ నుంచి కానరాని స్పందన
- పట్టించుకోని అధికారులు, వైసీపీ ప్రజాప్రతినిధులు



సముద్ర తీరంలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి ఎంపిక చేసిన అటవీ శాఖ భూములు

నక్కపల్లి, ఏప్రిల్ 17: **పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలంలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ (ఎఫ్ఎల్‌సీ) నిర్మాణం కలగానే మిగిలిపోయిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజయ్యపేట వద్ద సముద్ర తీరంలో ఎఫ్ఎల్‌సీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపి ఇరవై నెలలు దాటినప్పటికీ ఇంతవరకు కనీసం శంకుస్థాపన కూడా చేయలేదు. ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన ఆరు ఎకరాల భూమి అటవీ శాఖ పరిధిలో వుందని, దీనిని తమ శాఖకు అప్పగించాలని జిల్లా ఉన్నతాధికారులను లిఖితపూర్వకంగా కోరినట్టు మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. కనీసం మూడు ఎకరాలు ఇచ్చినా సర్దుకుపోతామని కోరినప్పటికీ అటవీ శాఖ నుంచి ఎటువంటి స్పందన లేదని అంటున్నారు. ఎఫ్ఎల్‌సీ నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు.**

నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ (ఎఫ్ఎల్‌సీ) ఏర్పాటు చేస్తామని వైసీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో ప్రభుత్వ పెద్దలు ప్రకటించారు. కానీ రెండేళ్లపాటు ఎటువంటి కదలిక లేదు. తరువాత కేంద్ర ప్రభుత్వ సిఫారసు మేరకు 2021 జూన్ నెలలో చెన్నైకి చెందిన ఐఐటీ నిపుణుల బృందం ఇక్కడకు వచ్చి స్థల పరిశీలన చేపట్టింది. ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటుకు ఇక్కడ వాతావరణం అనుకూలంగా ఉందని కేంద్రానికి నివేదించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన, ఐఐటీ నిపుణుల బృందం ఇచ్చిన నివేదికను పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం రూ.24.77 కోట్ల అంచనా వ్యయంతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటుకు 2022 ఏప్రిల్‌లో అనుమతి ఇచ్చింది. మరుసటి నెలలో మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్, మత్స్యశాఖ అధికారులకు ... మిగతా 8వ పేజీలో

వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



రాజయ్యపేట వద్ద ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితమే అనుమతులు, నిధులు మంజూరు చేసింది. ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన భూమిని అటవీ శాఖ నుంచి మంజూరు చేయించడంలో అధికారులు, వైసీపీ ప్రజాప్రతినిధులు విఫలం అయ్యారు. ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం విషయంలో వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడింది.

- కొవిరి వెంకటేశ్, జిల్లా అధ్యక్షుడు, జాతీయ మత్స్యకార సంఘం

పట్నంలో డ్రైనేజీలు అస్తవ్యస్తం

దశాబ్దాల కాలంగా పాలకుల నిర్లక్ష్యం

- వర్షమొస్తే రహదారులు మురుగుమయం
- దోమల బెడదతో ప్రజల అవస్థలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

నర్సీపట్నం, ఏప్రిల్ 17: **దశాబ్దాల కాలంగా నర్సీపట్నంలోని ప్రజలను డ్రైనేజీ సమస్య పట్టి పీడిస్తున్నది. నిత్యం దోమల బెడద, ఇంటి చుట్టూ మురుగు కంపుతో స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల ఏళ్ల తరబడి డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి నోచుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**

నర్సీపట్నం మెయిన్ రోడ్డులోని ప్రధాన డ్రైనేజీలు మొదలుకొని వార్డుల్లో ఉన్న అంతర్గత డ్రైనేజీల వరకు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. మెయిన్ రోడ్డుకి ఇరువులా ఉన్న డ్రైనేజీలు 40 ఏళ్లకు పూర్వం నిర్మించినవి కావడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. మెయిన్ రోడ్డులోని పక్కా కాలువలు కచ్చా కాలువలుగా మారిపోయాయి. డ్రైనేజీలకు ఇరువైపులా నిర్మించిన కర్బ్‌వాల్స్ (రాతికట్టు) పూర్తిగా శిథిలమైంది. మెయిన్ రోడ్డు విస్తరణలో ప్రధాన డ్రైనేజీ బాగు పడుతుందని అందరూ ఆశించారు. అయితే నిధుల మంజూరులో జాప్యం కారణంగా విస్తరణ పనులు నిలిచిపోయాయి. బలిఘట్టం, పెదబొడ్డేపల్లి ప్రాంతాల్లో కూడా డ్రైనేజీ వ్యవస్థ దుస్థితి ఇలాగే ఉంది. దోమల బెడద పెరిగిపోయి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

చిన్నపాటి వర్షానికే రోడ్లు మురుగుమయం

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో చిన్నపాటి వర్షానికే రోడ్డుపైకి మురుగునీరు వచ్చేస్తోంది. వెంకునాయుడుపేట, చింతపల్లి రోడ్డులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు ప్రధాన డ్రైనేజీల్లో పూడిక పేరుకుపోయాయి. దీని వల్ల ... మిగతా 8వ పేజీలో



సబ్ కలెక్టర్ ఆఫీసు ఎదురుగా డ్రైనేజీలో పేరుకుపోయిన పూడిక



జన సంచారం లేని కోటవురట్ల మెయిన్ రోడ్డు

తగ్గని భానుడి ప్రతాపం

సగం మండలాల్లో తీవ్ర వడగాడ్పులు

- రావికమతంలో 44.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

అనకాపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాపై భానుడి ప్రతాపం కొనసాగుతున్నది. బుధవారం కూడా వడగాడ్పులు వీశాయి. మంగళవారంతో పోలిస్తే పలు మండలాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గినప్పటికీ ఎండ తీవ్రత కొనసాగింది. ఉపాధి, కూలి పనుల నిమిత్తం బయటకు వెళ్లాల్సిన వారు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలోని సగం మండలాల్లో బుధవారం తీవ్ర వడగాడ్పులు వీశాయి. మూడు మండలాల్లో వడగాడ్పులు వీయగా, సముద్ర తీరంలో వున్న మండలాల్లో వడగాడ్పుల ప్రభావం అంతగా లేనప్పటికీ వేడి వాతావరణం కొనసాగింది. జిల్లాలో అత్యధికంగా ... మిగతా 8వ పేజీలో

కోడ్ కూసి నెల.. రంగులు మారకుంటే ఎలా..?

మాడుగుల మండలంలో పలుచోట్ల ఎన్నికల కోడ్ ఉల్లంఘన!

- ఇప్పటికీ వాటర్ ట్యాంకులు, శిలాఫలకంపై కనిపిస్తున్న వైసీపీ జెండా రంగులు
- పట్టించుకోని అధికారులు
- విస్తుపోతున్న ప్రజలు

మాడుగుల/ మాడుగుల రూరల్, ఏప్రిల్ 17 : ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను తూ.చ. తప్పక పాటించడం ఆయా శాఖల విధి. అందుకే పంచాయతీ అధికారి నుంచి జిల్లా కలెక్టర్ వరకు ఎన్నికల సమయాల్లో అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ.. సదరు నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తుంటారు. కానీ మాడుగుల మండలంలో పలుచోట్ల భిన్నంగా వ్యవహరిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. పలు గ్రామాల్లో ఇప్పటికీ వాటర్ ట్యాంకులపై వైసీపీ జెండా రంగులు కనిస్తుండడమే ఇందుకు ఉదాహరణగా పేర్కొంటున్నారు.


గదబవీధిలో ప్రస్తుతం వాటర్ ట్యాంక్‌కు ఉన్న రంగులు


లోవ గవరవరంలో వైసీపీ జెండా రంగులు మారని వాటర్ ట్యాంకు


ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో శిలాఫలకానికి ఉన్న రంగులు

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు మే 13న జరగనున్న నేపథ్యంలో దాదాపు నెల రోజుల క్రితం ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. నాటి నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు రాజకీయ నాయకుల విగ్రహాల ముఖాలకు ముసుగులు ధరించాలి. పార్టీల జెండాలు ఎక్కడా అనుమతి లేకుండా ఏర్పాటు చేయరాదు. అలాగే, అధికారంలో ఉండే పార్టీల జెండా రంగులు ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన వాటిపై ఉండరాదు అన్నది నిబంధన. కానీ మండలంలోని పలుచోట్ల ఇప్పటికీ అధికార పార్టీ వైసీపీ జెండాకు చెందిన రంగులు దర్శనమిస్తుండడాన్ని చూసి పలువురు నివ్వెరపోతున్నారు. ఎల్.పొన్నవోలు పంచాయతీ లోవ గవరవరం, గదబవీధి గ్రామల్లో గల రక్షిత మంచినీటి పథకాల ట్యాంకులకు గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో వేసిన ఆ పార్టీ జెండా రంగులు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఈ రంగులను తొలగించాల్సి ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారు. అదే విధంగా మాడుగులలో వెలుగు క్రాంతి పథం ఆధ్వర్యంలో ఏర్పాటైన మహిళా మార్టును స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన ఏర్పాటు చేశారు. ఈ మార్ట్‌లోకి వెళ్లేందుకు ఎంట్రన్స్‌లో ఇనుప గేట్లు ఉన్నాయి. వాటికి సైతం వైసీపీ జెండా రంగులు వేసేశారు. అలాగే ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి కింతలి వెళ్లేందుకు కొత్తగా తారురోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. ప్రస్తుతం ఈ శిలాఫలకంపై ఉన్న పేర్లు కనిపించకుండా కాగితాలు అంటించినప్పటికీ, శిలాఫలకానికి వేసిన వైసీపీ జెండా రంగులు మాత్రం తొలగించలేదు. వీటిని చూసినవారు ఎన్నికల కమిషన్ ఆదేశాలను సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.


మాడుగులలో మహిళా మార్టు గేట్లకు వైసీపీ రంగులు


మార్ట్ ముందు జెండా దిమ్మకు వైసీపీ రంగులు

పులకించిన భద్రగిరి



భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక


జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం


కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


స్వామివారి ఊరేగింపు


ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు


గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



క్రైం... crime news

పెదగోగాడ గెడ్డలో పడి ఆర్మీ ఉద్యోగి మృతి

చీడికాడ, ఏప్రిల్ 17: బైక్‌పై వెళుతున్న ఆర్మీ ఉద్యోగి ప్రమాదవశాత్తు గెడ్డలోపడి మృతి చెందినట్టు ఎస్ఐ జి.నారాయణరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. బుచ్చెయ్యపేట మండలం పి.భీమవరం గ్రామానికి చెందిన పడాల వరహాలు (32) హైదరాబాద్‌లోని ఆర్మీలో పనిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం సెలవుపై స్వగ్రామానికి వచ్చారు. మంగళవారం సాయంత్రం అత్తవారి గ్రామం అయిన దేవరాపల్లి మండలం వాకపల్లి వెళ్లేందుకు వరహాపురం మీదుగా పెదగోగాడ రోడ్డులో బైక్‌పై వెళుతున్నారు. అయితే పెదగోగాడ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న గెడ్డలో బైక్ అదుపుతప్పి పడిపోయి అక్కడికక్కడే మృతిచెందారని ఎస్ఐ వివరించారు. బుధవారం సాయంత్రం పశువులు మేపుతున్న పెదగోగాడకు చెందినవారు మృతదేహాన్ని చూసి తమకు సమాచారం అందించారన్నారు. దీంతో ఏఎస్ఐ నాగేశ్వరరావు సిబ్బందితో వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించామన్నారు. బుధవారం రాత్రి మృతుడి తండ్రి సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా వరహాలుకు మూడు సంవత్సరాల క్రితం వివాహమైంది. భార్య, రెండేళ్ల బాలుడు ఉన్నారు.


పడాల వరహాలు (ఫైల్)

14 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 17: మండలంలోని దార్లపూడి వద్ద బుధవారం 14 మద్యం బాటిళ్లను తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ఎలమంచిలి మండలం ఏటికొప్పాకలో ఉన్న ప్రభుత్వ మద్యం షాపు నుంచి మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి తరలిస్తుండగా దార్లపూడిలో పట్టుకొని, వాటిని సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 17: ప్రమాదవశాత్తూ మేడ మెట్ల పైనుంచి జారిపడి తీవ్రగాయాలకు గురై విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం ఉదయం మృతి చెందినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ రాజు తెలిపారు. తుమ్మపాల గ్రామానికి చెందిన దాసరి కృష్ణ (44) ఈ నెల 14వ తేదీ రాత్రి ఇంటి రెండో ఫ్లోర్‌లోకి వెళ్లేందుకు మెట్లు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తూ జారి పడిపోవడంతో తలకు బలమైన గాయమైందన్నారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

12 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 17: పూడిమడకరోడ్డులోని జాతీయ రహదారి జంక్షన్ వద్ద బుధవారం ఒక వ్యక్తి నుంచి 12 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. కశింకోట మండలం జమాదులపాలెం గ్రామానికి చెందిన గొల్లవిల్లి శ్రీనివాసరావు మద్యం కొనుగోలు చేసి స్వగ్రామం వెళుతుండగా జాతీయ రహదారి జంక్షన్‌లో పట్టుకున్నామన్నారు. అతని వద్ద మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

అగ్రిగోల్డ్ బాధితులకు అన్యాయం చేసిన సీఎం

- లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 17: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని 20 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులను నమ్మించి తీరని అన్యాయం చేశారని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆరోపించారు. బుధవారం జనసేన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గడిచిన పదేళ్లుగా అగ్రిగోల్డ్ బాధితుల కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నామన్నారు. 2017 మార్చి 23న విజయవాడలో బాధితులు దీక్ష చేపట్టగా శిబిరాన్ని సందర్శించిన జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో బాధితులకు ప్రతి పైసా చెల్లిస్తామని నమ్మబలికి ఓట్లు వేయించుకున్నారని, అధికారంలోకి వచ్చాక కనీసం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అగ్రిగోల్డ్ బాధితుల్లో ఉత్తరాంధ్రలో ఆరు లక్షల మంది ఉన్నారని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 600 మంది అగ్రిగోల్డ్ బాధితులు చనిపోయారని, వారికి రూ.మూడు లక్షలు అప్పటి సీఎం చంద్రబాబు ప్రకటిస్తే జగన్ రూ.పది లక్షలు ప్రకటించి విడుదల చేయలేదన్నారు. అగ్రిగోల్డ్ కంపెనీకి రూ.20వేల కోట్ల ఆస్తులున్నాయని ప్రభుత్వం ప్రకటించి కూడా బాధితులకు న్యాయం చేయకపోవడాన్ని బాబ్జీ తప్పుపట్టారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగేలా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రకటన చేయాలని భీశెట్టి డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కె.రమణ, కేఎం నాయుడు, కె. నరసింగరావు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న బాబ్జీ

దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 17: వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

ఎర్నాకులం-పాట్నా-ఎర్నాకులం అన్ రిజర్వ్‌డ్

06085 నంబరు గల రైలు ఈనెల 19 నుంచి జూన్ 28 వరకు ప్రతి శుక్రవారం రాత్రి 11.00 గంటలకు ఎర్నాకులంలో బయలుదేరి మర్నాడు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ, సోమవారం ఉదయం 3.30 గంటలకు పాట్నా చేరుతుంది. తిరిగి ఈనెల 22 నుంచి జూలై ఒకటి వరకు ప్రతి సోమవారం రాత్రి 11.45 గంటలకు పాట్నాలో బయలుదేరి బుధవారం తెల్లవారుజాము 1.05 గంటలకు దువ్వాడ, గురువారం ఉదయం 10.30 గంటలకు ఎర్నాకులం చేరుతుంది.

బెంగళూరు-హౌరా-బెంగళూరు

06585 నంబరు గల రైలు ఈనెల 19 నుంచి మే 24 వరకు ప్రతి శుక్రవారం 00.30 గంటలకు (గురువారం అర్ధరాత్రి 12.30) ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరి శుక్రవారం రాత్రి 7.25 గంటలకు దువ్వాడ, మర్నాడు ఉదయం 10.00 గంటలకు హౌరా చేరుతుంది. తిరిగి ఈనెల ఈనెల 20 నుంచి మే 25 వరకు ప్రతి శనివారం మధ్యాహ్నం 1.05 గంటలకు హౌరాలో బయలుదేరి మర్నాడు తెల్లవారుజాము 3.03 గంటలకు దువ్వాడ, రాత్రి 8.10 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుతుంది.

ప్రభుత్వ మద్యం షాపు సూపర్‌వైజర్‌పై కేసు

- ఆరు మద్యం బాటిళ్లు తరలిస్తుండగా పట్టివేత

పాయకరావుపేట, ఏప్రిల్ 17 : పట్టణంలోని ఓ ప్రభుత్వ మద్యం షాపులో సూపర్‌వైజర్ బుధవారం ఉదయం ఎటువంటి అనుమతుల్లేకుండా ఆరు మద్యం బాటిళ్లు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముందుగా అందిన సమాచారం మేరకు బుధవారం ఉదయం పట్టణ శివారులో ఎస్ఐ జోగారావు, సిబ్బంది వాహన తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో పట్టణంలోని ఓ ప్రభుత్వ వైన్‌షాపు సూపర్‌వైజర్ కోనేటి నాగవెంకటపద్మారావు ఎటువంటి అనుమతుల్లేకుండా ప్లాస్టిక్ కవర్‌లో ఆరు మద్యం బాటిళ్లను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. దీనిపై ఎస్ఐ జోగారావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయమై ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ధర్మారావుని వివరణ కోరగా.. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా నివేదిక తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

నేటి నుంచి అప్పన్న వార్షిక తిరు కల్యాణోత్సవాలు

సింహాచలం, ఏప్రిల్ 17 : వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు వేకువజామున నాలుగు గంటలకు సుప్రభాతసేవ, ఆరాధన, బాలభోగం నివేదన, మంగళా శాసనములు చేసి, 7.30 గంటలకు భక్తులకు స్వామి వారి దర్శనాలు కల్పిస్తారు. మధ్యాహ్నం 11.30 గంటలకు మహా నివేదన (రాజభోగము) కావడంతో 12.30 గంటల వరకు దర్శనాలు నిలిపివేస్తారు. రాత్రి 7 తర్వాత భక్తులకు దర్శనాలు లభించవని అధికారులు ప్రకటించారు. 19న రాత్రి 9.30 నుంచి స్వామివారి వార్షిక తిరు కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. 24న ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, 8 గంటల నుంచి వినోదోత్సవం (ఉంగరపు సేవ) నిర్వహిస్తారు.


సిద్ధమవుతున్న కల్యాణ వేదిక

దర్శన వేళల్లో స్వల్ప మార్పులు

వార్షిక తిరు కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం నుంచి ఈ నెల 24 వరకు ప్రతిరోజు రాత్రి 7 గంటల తర్వాత భక్తులకు స్వామివారి దర్శనాలు నిలిపివేస్తారు. 18న స్వామివారి కొట్నాల ఉత్సవం పురస్కరించుకుని మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 8 వరకు దర్శనాలు నిలిపివేయనున్నారు. రాత్రి 8 నుంచి 10 గంటల వరకు దర్శనాలు కల్పిస్తారు. 24న వినోదోత్సవాన్ని పురస్కరించుకుని మధ్యాహ్నం 11.30 నుంచి మహాసంప్రోక్షణ, ఆరాధన, బాలభోగం, రాజభోగము నివేదనలు కారణంగా 2.30 వరకు దర్శనాలు నిలిపివేస్తారు. రాత్రి 6 గంటలకు శ్రీపుష్పయాగము, ఉంజలసేవ, సంవాదసేవల కారణంగా సాయంత్రం 6 నుంచి దర్శనాలు నిలిపివేయనున్నారు.

ఆర్జిత సేవలు రద్దు

ఉత్సవాలను పురస్కరించుకుని కొన్ని ఆర్జిత సేవలను కూడా రద్దు చేస్తున్నట్టు దేవస్థానం అధికారులు ప్రకటించారు. ప్రధానంగా సుప్రభాత సేవ, రెండు పూటల ఆరాధన సేవ టికెట్లు రద్దు చేశారు. 18 నుంచి 25 వరకు రాత్రి 7 గంటల తరువాత భక్తులకు దర్శనాలు లభించవు. ఈ మేరకు ఏప్రిల్ 18 నుంచి మే 4 వరకు వరకు ఆలయంలో జరిగే ఆర్జిత సేవలన్నీ రద్దు చేశారు.

కుమార్తెతో పాటు వివాహిత అదృశ్యం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 17: కుమార్తెతో వివాహిత అదృశ్యంపై అందిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్ఐ వి. సత్యనారాయణ తెలిపారు. శారదానగర్‌కు చెందిన పలివెల నీలమ్మ, తన కుమార్తె చరిత్రశ్రీను వెంట బెట్టుకుని మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి రాలేదని భర్త ఆనంద్ ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం రమేశ్ దంపతులు

నక్కపల్లి, ఏప్రిల్ 17: ఉపమాక మెరకవీధి రామాలయం వద్ద బుధవారం ఉదయం జరిగిన సీతారాముల కల్యాణోత్సవాల్లో భాగంగా అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. సీఎం రమేశ్ దంపతులకు ఎన్‌డీఏ నాయకులు గెడ్డం బుజ్జి, కొప్పిశెట్టి కొండబాబు, కొప్పిశెట్టి వెంకటేశ్, కొప్పిశెట్టి బుజ్జి, తదితరులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం రమేశ్ దంపతులకు వేద ఆశీర్వచనం చేశారు.


స్వామివారి కల్యాణానికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ దంపతులు

ఫ్లయింగ్ స్క్వాడ్ పేరుతో మాజీ సర్పంచ్‌కి టోకరా

- ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు అపహరణ

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 17 : ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ పేరుతో మాజీ సర్పంచ్‌కి టోకరా వేసి ఎనిమిది తులాల బంగారు ఆభరణాలతో ఇద్దరు దుండగులు పరారయ్యారు. ఇందుకు సంబంధించి బాధితుడి కథనం ప్రకారం వివరాలివి. మండలంలోని మంగళాపురం పంచాయతీ మాజీ సర్పంచ్ అల్లంకి వెంకటఅప్పారావు బుధవారం తన స్వగ్రామం నుంచి స్కూటీ వాహనంపై చోడవరం బయలుదేరారు. బీఎన్ రోడ్డులో విజయరామరాజుపేట దాటగానే వెనకనుంచి బైక్‌పై ఇద్దరు ఆగంతకులు వచ్చి అతని స్కూటీకి అడ్డంగా బైక్‌పెట్టి ఆపారు. తాము ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అని చెప్పి, స్కూటీలో గల బ్యాగ్‌ను తనిఖీ చేశారు. ఇద్దరిలో ఒకరు తెలుగు, మరొకరు హిందీలో మాట్లాడారు. బ్యాగ్‌లో రూ.నాలుగు వేల నగదు కనిపించింది. అలాగే, వెంకటఅప్పారావు ఒంటిపై బంగారు ఆభరణాలను చూశారు. ఒంటిపై అంత బంగారం పెట్టుకుని ప్రయాణిస్తే ఎన్నికల నియమావళికి విరుద్ధమని చెప్పి, ఒంటిపై ఉన్న బంగారం చైన్‌ను స్కూటీలో ఉన్న బ్యాగ్‌లో వేశారు. ఐదు ఉంగరాలతో పాటు బ్రాస్‌లెట్‌ను మరో కాగితంలో పెట్టి పొట్లాంలా కట్టారు. ఆ పొట్లాంను బ్యాగ్‌లో వేసినట్టు నటించి బ్యాగ్ జిప్ వేసి స్కూటీలో పెట్టారు. చైన్‌తో పాటు బంగారం ఆభరణాల పొట్లాం కూడా బ్యాగ్‌లో పెట్టారని ఆయన భావించారు. అక్కడి నుంచి జాగ్రత్తగా వెళ్లమని చెప్పిన ఆగంతకులు బైక్‌పై వేగంగా వడ్డాది వైపు వెళ్లిపోయారు. అనంతరం అనుమానం వచ్చిన వెంటఅప్పారావు స్కూటీలో ఉన్న బ్యాగ్‌ను తీసి చూడగా చైన్ మాత్రమే బ్యాగ్‌లో కనిపించింది. ఉంగరాలు, బ్రాసెట్ ఆభరణాలు పొట్లాం కనిపించక పోవడంతో తాను మోసపోయానని గుర్తించి స్కూటీపై వారిని వెంబడించారు. వడ్డాది కూడలి చేరుకునే సరికి ఆగంతకులు బైక్ కనిపించలేదు. అగంతకులు నాలుగు తులాల ఉంగరాలు, నాలుగు తులాల బ్రాసెట్ మొత్తం ఎనిమిది తులాల బంగారం ఆభరణాలు తస్కరించారని బాధితుడు వాపోయారు. ఈ మేరకు 100 నెంబరుకి ఫోన్ చేసి సమాచారం అందించినట్టు ఆయన తెలిపారు.



సమర్థతకు ప్రాధాన్యం ఇవ్వాలి



సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్లో సమర్థులైన వారిని ఎన్నుకోవాలి. నియోజకవర్గంలో సమస్యలు గుర్తించి, ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపగలిగే సమర్థత ఉన్న అభ్యర్థిని గెలిపించుకోవాలి. కుల, మత, వర్గ, ప్రాంతీయ వాదాలకు తావులేకుండా సమర్థతను పరిగణనలోకి తీసుకోవాలి. సమర్థనాయకుడితోనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని గుర్తించాలి.

- ఎంవీవీటీ ఆచారి, బియ్యం వ్యాపారి, అశోక్‌నగర్

సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చే ప్రభుత్వం రావాలి



గత ఐదేళ్లలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. కొన్నిరకాల సరకుల ధరలు రెట్టింపు అయ్యాయి. ప్రకృతి వనరులను ధ్వంసం చేస్తున్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచకుండా సంక్షేమ పథకాలను ఎడాపెడా అమలు చేయడం సరికాదు. పాలకులు సంక్షేమానికి ఎనలేని ప్రాధాన్యం ఇచ్చి రాష్ట్రాన్ని తిరుగమన దిశగా తీసుకెళ్లారు. ఇటువంటి తరుణంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకెళ్లగల పాలకులు రాష్ట్రానికి ఎంతో అవసరం. వచ్చే ఎన్నికల తరువాత ఇటువంటి ప్రభుత్వం ఏర్పడాలని ఆకాంక్షిస్తున్నాను.

- ఆళ్ల నూకేశ్వరరావు, తుమ్మపాల షుగర్స్ మాజీ ఉద్యోగి, అనకాపల్లి

సేవ చేసే వారినే ఎన్నుకోవాలి



ప్రజలకు సేవ చేసే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చే నాయకులను పాలకులుగా ఉంటే అభివృద్ధి సాధ్యం. అక్రమంగా ఆస్తులను కూడబెట్టడం, కాపాడుకోవడానికి పదవుల్ని అడ్డుపెట్టుకునే వారిని తరిమికొట్టాలి. స్థానిక సమస్యలు తెలిసి, పరిష్కారానికి సమర్థంగా పనిచేయగల నేతలను ఎన్నుకోవాలి. నిత్యం అందుబాటులో ఉండే వారిని ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకుంటే సరైన న్యాయం జరుగుతుంది.

- పి.నాగేశ్వరరావు, కాంట్రాక్టర్, గోపాలపట్నం

ఉపాధి చూపించే సామర్థ్యం అవసరం



యువతకు ఉపాధి చూపించగలిగే నేతకు ఓటు వేసి ఎన్నుకుంటే సమాజానికి మంచి జరుగుతుంది. వ్యవసాయ, పారిశ్రామిక, చేతివృత్తుల రంగాల్లో అనుభవం ఉన్న అభ్యర్థులే మేలు. యువతకు ఉపాధి విషయంలో చేయూత ఇచ్చేవారినే ఎన్నుకోవాలి.

- తిరునగరి రాజా,
స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టర్, పెదగంట్యాడ

సేవాభావం ఉండాలి



సేవాభావం కలిగిన వారిని చట్టసభలకు ఎన్నికోవాలి. ఆస్తులు కాపాడుకునేందుకో, ఆస్తులు పెంచుకునేందుకో, అధికారం కోసమో చట్టసభలకు వెళ్లాలను కునేవారిని ఓటర్లు తిరస్కరించాలి.పోటీలో ఉన్న అభ్యర్థుల్లో మంచివారిని ఎన్నుకోవడం ద్వారా సమాజానికి కొంతవరకు మేలుచేసినట్టే. ఐదేళ్లు పరిపాలించే ప్రతినిధులను ఎంపిక చేయడంలో ఏమరుపాటు ప్రదర్శిస్తే శిక్ష వేసుకున్నట్టే.

- యు.రాములునాయుడు,
విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి, గాజువాక

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుంటున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

మీరూ పంపించండి

వాట్సాప్ నంబర్ ... 9848212243



దేశం కంచుకోట సౌత్

సెగ్మెంట్ స్కాన్
విశాఖ దక్షిణం





ద్రోణంరాజు శ్రీనివాస్

నియోజకవర్గం ఏర్పడిన తరువాత మూడుసార్లు ఎన్నికలు

- రెండుసార్లు టీడీపీ అభ్యర్థి గెలుపు
- 2019 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ వేర్వేరుగా పోటీ... అయినా టీడీపీ అభ్యర్థి విజయం
- తాజా ఎన్నికల్లో కూటమిగా ఏర్పడ్డ టీడీపీ, జనసేన, బీజేపీ
- పొత్తులో భాగంగా జనసేనకు కేటాయింపు
- ఉమ్మడి అభ్యర్థిగా వంశీకృష్ణ శ్రీనివాస్
- గెలుపు నల్లేరుమీద నడకేనని కూటమి నేతల్లో విశ్వాసం



వాసుపల్లి గణేష్‌కుమార్



వంశీకృష్ణ శ్రీనివాస్

- మరోవైపు వైసీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా గెలుపు... ఆ తరువాత వైసీపీలోకి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ దక్షిణ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా గుర్తింపు పొందింది. నియోజకవర్గాల పునర్విభజనతో ఏర్పడిన 'సౌత్' 2009లో ఇప్పటివరకూ మూడుసార్లు ఎన్నికలు జరగ్గా రెండుసార్లు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులే విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ వేర్వేరుగా పోటీ చేశాయి. అయినప్పటికీ టీడీపీ అభ్యర్థి విజయాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అడ్డుకోలేకపోయారు. తాజా ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ఉమ్మడి అభ్యర్థిగా వంశీకృష్ణ శ్రీనివాస్‌ను పోటీకి దింపాయి. నియోజకవర్గ గత చరిత్రను బట్టి చూస్తే కూటమి అభ్యర్థి విజయం నల్లేరుమీద నడకేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

దక్షిణ నియోజకవర్గంలో ముస్లింలు, క్రైస్తవులు, మత్స్యకారులు, బ్రాహ్మణులు, కాపులు, వెలమ, చేనేత (పద్మశాలి), యాదవులతో పాటు మార్వాడీలు ఉన్నారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత 2009లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి ద్రోణంరాజు శ్రీనివాస్, ప్రజారాజ్యం పార్టీ నుంచి కోలా గురువులు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా వాసుపల్లి గణేష్‌కుమార్, ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కలిపి మొత్తం 11 మంది పోటీ చేశారు. అప్పటికి నియోజకవర్గంలో 1,74,557 మంది ఓటర్లు ఉండగా, 1,28,907 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలైన ఓట్లలో 45,971 (35.66 శాతం) కాంగ్రెస్ అభ్యర్థి ద్రోణంరాజు శ్రీనివాసరావుకు దక్కగా, ప్రజారాజ్యంపార్టీ అభ్యర్థి కోలా గురువులుకు 45,630 లభించాయి. దీంతో 341 ఓట్లు స్వల్ప తేడాతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 1,97,541కి పెరిగింది. ఆ ఎన్నికల్లో టీడీపీ నుంచి తిరిగి వాసుపల్లి గణేష్‌కుమార్, వైసీపీ నుంచి కోలా గురువులు, కాంగ్రెస్ పార్టీ నుంచి ద్రోణంరాజు శ్రీనివాస్ పోటీ చేశారు. టీడీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌కు 66,686 (51.45 శాతం) ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి కోలా గురువులుకు 48,370 (37.32 శాతం), కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ద్రోణంరాజు శ్రీనివాస్‌కి 8,280 (6.39 శాతం) ఓట్లు లభించాయి. టీడీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ 18,316 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి మళ్లీ వాసుపల్లి గణేష్‌కుమార్, వైసీపీ నుంచి ద్రోణంరాజు శ్రీనివాస్, జనసేన నుంచి గంపల గిరిధర్, బీజేపీ నుంచి కొప్పల రామ్‌కుమార్ పోటీ చేశారు. నియోజకవర్గ ఓటర్ల సంఖ్య 2,09,356కు పెరిగినప్పటికీ 1,25,701 మంది మాత్రమే ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలైన ఓట్లలో టీడీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌కు 52,172 (41.5 శాతం) ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి ద్రోణంరాజు శ్రీనివాస్‌కు 48,443 (38.15 శాతం) ఓట్లు వచ్చాయి. జనసేన పార్టీ అభ్యర్థి గంపల గిరిధర్‌కు 18,119 (14.41 శాతం) ఓట్లు, బీజేపీ అభ్యర్థి కొప్పల రామ్‌కుమార్ 2,397 (1.91 శాతం) దక్కాయి. దీంతో వరుసగా రెండోసారి కూడా విజయం టీడీపీ అభ్యర్థినే వరించింది. తాజాగా వచ్చే నెలలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయి. అందులో భాగంగా దక్షిణ నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా జనసేన పార్టీకి చెందిన వంశీకృష్ణశ్రీనివాస్ బరిలో నిలవగా, గత ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలిచి, ఆ తర్వాత అధికార పార్టీలో చేరిన వాసుపల్లి గణేష్ కుమార్ వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఇద్దరు నేతలు ఇప్పటికే నియోజకవర్గంలో ప్రచారం ముమ్మరం చేశారు.

వాసుపల్లికి ముప్పేట వ్యతిరేకత

వైసీపీ తరపున పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు టికెట్ ఇవ్వొద్దని, ఒకవేళ ఇస్తే ఓడిస్తామంటూ ఆయన సొంత సామాజిక వర్గానికి చెందినవారే ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి ముందు సమావేశమై అధికార పార్టీకి అల్టిమేటం ఇచ్చారు. ఇక వైసీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో ఉన్న నేతలు కూడా వాసుపల్లి నాయకత్వాన్ని అంగీకరించడం లేదు. ఇదే కారణంతో కొంతమంది కార్పొరేటర్లు కూడా ఆ పార్టీని వీడారు. కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇక నియోజకవర్గంలో బ్రాహ్మణ సామాజిక వర్గంలో మంచి పట్టు కలిగిన సీతంరాజు సుధాకర్ నిన్నమొన్నటి వరకూ వైసీపీలో ఉన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. వాసుపల్లి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీకి రాజీనామా చేశారు. కూటమి అభ్యర్థి వంశీకృష్ణశ్రీనివాస్‌కు మద్దతు ప్రకటించారు. ఆయన నేడో, రేపో తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్టు చెబుతున్నారు. వీటన్నింటితోపాటు 2019 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ విడివిడిగా పోటీ చేయడంతో వైసీపీ వ్యతిరేక ఓటు కూడా ఆయా పార్టీల మధ్య చీలిపోయింది. టీడీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌కు 52,172 (41.5 శాతం), జనసేన పార్టీ అభ్యర్థి గంపల గిరిధర్‌కు 18,119 (14.41 శాతం) ఓట్లు, బీజేపీ అభ్యర్థి కొప్పల రామ్‌కుమార్ 2,397 (1.91 శాతం) పడ్డాయి. వైసీపీ అభ్యర్థి ద్రోణంరాజు శ్రీనివాస్‌కు 48,443 (38.15 శాతం) ఓట్లు లభించాయి. 2019 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ గాలివీచినప్పుడే దక్షిణ నియోజకర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గెలిచారు. ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని అనేక సర్వేలు వెల్లడిస్తున్నాయి. పైగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ఉమ్మడి అభ్యర్థిని బరిలోకి దింపుతున్నాయి. గత ఎన్నికల్లో ఆ మూడు పార్టీలకు లభించిన ఓట్లు కలిపితే 72,688 (58 శాతం). ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల్లో తమ అభ్యర్థి విజయం తథ్యమని కూటమి (తెలుగుదేశం, జనసేన, బీజేపీ) నేతలు విశ్వాసం వ్యక్తంచేస్తున్నారు.

అక్కడ నుంచి ఏడుసార్లు ఎమ్మెల్యేలు

ఇదీ 'చీడికాడ మండలం' ప్రత్యేకత

- 1978 నుంచి ప్రతి ఎన్నికల్లో చీడికాడ మండల వాసుల పోటీ
- మాడుగుల నియోజకవర్గానికి ఇప్పటికి 14సార్లు ఎన్నికలు... ఏడుసార్లు చీడికాడ మండలవాసుల గెలుపు



కురచా రామునాయుడు (మాజీ ఎమ్మెల్యే)



రెడ్డి సత్యనారాయణ, మాజీ మంత్రి



గవిరెడ్డి రామానాయుడు, మాజీ ఎమ్మెల్యే

అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గ పరిధిలో గల 'చీడికాడ' జనాభాపరంగా చాలా చిన్న మండలం. అయితే మాడుగుల నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం 1978 నుంచి చీడికాడ మండల వాసులే పోటీ చేస్తున్నారు. 2019 వరకూ మాడుగుల నియోజకవర్గానికి 14 సార్లు ఎన్నికలు జరగ్గా చీడికాడ మండలవాసులే ఏడుసార్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 1978 నుంచి నేటి వరకూ ప్రతి ఎన్నికల్లోను చీడికాడ ప్రాంతవాసులు పోటీ చేస్తున్నారు. మండలంలో అప్పలరాజుపురం గ్రామానికి చెందిన కురచా రామునాయుడు 1978లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలుపొందారు. ఆ తరువాత 1985, 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అలాగే మండలంలోని పెదగోగాడ గ్రామానికి చెందిన రెడ్డి సత్యనారాయణ 1983, 1985, 1989, 1994, 1999, 2004 ఎన్నికల్లో ఆరుసార్లు టీడీపీ అభ్యర్థిగా పోటీచేయగా ఒక్క 2004 మినహాయించి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. రెండుసార్లు రాష్ట్ర మంత్రిగాను, అంచనాల కమిటీ చైర్మన్‌గాను, టీటీడీ బోర్డు సభ్యునిగాను పలుమార్లు పనిచేశారు. అదేవిధంగా అప్పలరాజుపురం గ్రామానికి చెందిన గవిరెడ్డి రామానాయుడు 2004 ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గాను, 2009, 2014, 2019 ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేయగా 2009లో గెలుపొందారు. అప్పలరాజుపురం గ్రామానికే చెందిన గవిరెడ్డి సన్యాసినాయుడు 1999లో అన్న టీడీపీ తరపున, 2019లో జనసేన తరపున పోటీ చేసి ఓటమిచెందారు. అదే గ్రామానికి చెందిన కురచా నారాయణమూర్తి 2014లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. అలాగే చీడికాడ గ్రామానికి చెందిన బొడ్డు శ్రీనివాసరావు 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిచెందారు. వచ్చే ఎన్నికల్లోనూ ఆయన మళ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. మండలంలో ఖండివరం గ్రామానికి చెందిన చిరుమూరి శివాజీరాజు 2009, 2019 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. మాడుగుల నియోజకవర్గంలో మిగిలిన మండలాల కంటే 'చీడికాడ' చిన్న మండలం. జనాభా, ఓటర్లు తక్కువ. ఒకే వ్యక్తి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఘనత ఈ మండలవాసి (రెడ్డి సత్యనారాయణ)కే దక్కుతుంది.

● చీడికాడ

నగదు తీసుకెళ్తున్నారా...

- ఎన్నికల వేళ జాగ్రత్తలు తప్పనిసరి
- రూ.50 వేలకు మించితే ఆధారాలు చూపాల్సిందే

ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో పోలీసులు అన్ని చోట్లా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. వాహనాలతో పాటు ప్రజలు తమతో పాటు తీసుకెళ్తున్న బ్యాగులు, ఇతర వస్తువులు సైతం క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సరైన ఆధారాలు లేకుండా ఎవరైనా రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్తే స్వాధీనం చేసుకుంటారు. కొన్నిసార్లు సొంత పనుల మీద ఇతర ప్రాంతాలకు నగదు తీసుకువెళ్తున్నా ఇబ్బందులు తప్పవు. ఎన్నికల నియమ, నిబంధనల మేరకు తగిన ఆధారాలతో అధిక మొత్తంలో నగదు తీసుకువెళ్లవచ్చు. ఆ వివరాలివి..

ఫైనాన్స్, చిట్టీల వ్యాపారులు

చిట్టీలు, ఫైనాన్స్ సంస్థల్లో ప్రతి రోజు భారీగా లావాదేవీలు జరుగుతాయి. కలెక్షన్‌ల ఏజెంట్‌ల వద్ద రూ.లక్షల్లో నగదు ఉంటుంది. వీరు ఆ రోజు చేసిన కలెక్షన్ పద్దులు, బాకీ ఉన్న నగదు, వసూలైన నగదు ఇలా అన్ని వివరాలతో పాటు కస్టమర్‌ల సంతకంతో కూడిన ప్రతులు తప్పనిసరిగా తమ వెంట ఉంచుకోవాలి.

బంగారు ఆభరణాల కొనుగోలు

శుభకార్యాలు నిర్వహించే సమయంలో బంగారు, ఇతర వస్తువులు కొనుగోలుకు నగదు తీసుకు వెళ్తారు. శుభకార్యాల కోసం నగదు తీసుకువెళ్లే వారు తమ వెంట శుభలేఖ ఉంచుకోవాలి. అదే విధంగా పోలీసులు అడిగిన అన్ని వివరాలకు పూర్తి సమాచారం ఇవ్వాలి.

బ్యాంకు లావాదేవీలు....

బ్యాంకు లావాదేవీలు రూ.50వేలకు మించితే ఆధారాలు చూపించాలి. చెక్కు ద్వారా నగదు విత్‌డ్రా చేస్తే చెక్కు జెరాక్స్, పాస్‌బుక్ దగ్గర ఉంచుకోవాలి. ఏటీఎం ద్వారా నగదు వీత్‌డ్రా చేస్తే ఏటీఎం స్లిప్‌లు జాగ్రత్తచేయాలి (కొన్ని బ్యాంకుల ఏటీఎంలో ప్రస్తుతం రోజు వారీ పరిమితి 20వేలుగా ఉంది). ఒకవేళ నగదు బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు వెళ్లే ఆ నగదుకు సంబంధించిన అన్ని వివరాలు అందుబాటులో ఉంచుకోవాలి. ఎవరు, ఎందుకు ఇచ్చారో ఆధారాలుండాలి. పాస్‌బుక్ కూడా ఉండాలి.

ఆస్పత్రి బిల్లులు చెల్లింపులు

అత్యవసర సమయాల్లో అధికమొత్తంలో ఆస్పత్రి బిల్లులు చెల్లించక తప్పదు. ఇలాంటి సమయంలో రోగి మెడికల్ కేస్ షీట్, మెడికల్ సర్టిఫికెట్, ఆస్పత్రి బిల్లులకు సంబంధించి బిల్లులు అందుబాటులో ఉంచుకోవాలి.

విద్యాసంస్థల ఫీజులు

పిల్లల చదువుల కోసం సంబంధిత పాఠశాల, కళాశాల యాజమాన్యాలకు ఫీజు చెల్లించాలంటే నగదు తీసుకువెళ్లకు తప్పదు. నగదు ఎందుకు తీసుకువెళ్తున్నారనే విషయంలో సంబంధిత యాజమాన్యం రశీదులు ఉండాలి. నగదు చెల్లించకముందు ఫీజు కట్టాలనే నోటీసులు వెంట ఉంచుకోవాలి. అవసరమైనంత మేరకు ఆన్‌లైన్‌లో పే చేయడం మేలు.

● ఉక్కుటౌన్‌షిప్



తగరపువలస గోస్తనీ చెక్‌పోస్టు వద్ద కారును తనిఖీ చేస్తున్న ఎస్ఎస్‌టీ సిబ్బంది (ఫైల్)



పద్మనాభం మండలం రేవిడి గ్రామం

నాడు నియోజకవర్గ కేంద్రంగా రేవిడి

1955 ఎన్నికల్లో పద్మనాభరాజు, 1962లో కోళ్ల అప్పలనాయుడు గెలుపు



తొలి ఎమ్మెల్యేగా పని చేసిన పద్మనాభరాజు



రెండో ఎమ్మెల్యేగా ఎన్నికైన కోళ్ల అప్పలనాయుడు

ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైన తరువాత నిర్వహించిన తొలి సార్వత్రిక ఎన్నికలలో పద్మనాభం మండలం రేవిడి గ్రామం శాసనసభ నియోజకవర్గ కేంద్రంగా ఉండేది. అప్పటికే ఈ గ్రామం బ్రిటీషు ప్రభుత్వ ఏలుబడిలో భూముల శిస్తు వసూళ్లను, ఇతర కార్యకలాపాలను చూసే ఫిర్కా (రెవెన్యూ బ్లాక్)గా ఉండేది. దీంతో పాటు ఈ గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు భూపతిరాజు వెంకటపతిరాజు ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం భూస్వాముల నియోజక వర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికవ్వడంతో రేవిడికి ప్రత్యేక గుర్తింపు లభించింది. అలాగే భారత ఎన్నికల సంఘం ఎనిమిదో ప్రధాన ఎన్నికల కమిషనర్ (1986-90)గా పనిచేసిన ఆర్‌వీఎస్ పేరిశాస్త్రి కూడా ఈ గ్రామానికి చెందినవారే. ఈ నేపథ్యంలో తొలి (1955), మలి (1962) సార్వత్రిక ఎన్నికల వరకు రేవిడి నియోజకవర్గ కేంద్రంగా కొనసాగింది. 1955లో జరిగిన శాసనసభ ఎన్నికలలో కాకర్లపూడి విజయరాఘవ సత్యనారాయణ పద్మనాభరాజు (కేవీఆర్ఎస్ పద్మనాభరాజు) ప్రజా సోషలిస్టు పార్టీ నుంచి, 1962లో కోళ్ల అప్పలనాయుడు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1955 ఫిబ్రవరి 11న నిర్వహించిన సార్వత్రిక ఎన్నికలలో ప్రజా సోషలిస్టు పార్టీ తరఫున పోటీ చేసిన కేవీఆర్ఎస్ పద్మనాభరాజు సమీప ప్రత్యర్థి సీపీఐ అభ్యర్థి గుజ్జు రామునాయుడుకు 11,891 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. పద్మనాభరాజుకు 15,217 ఓట్లు రాగా, రామునాయుడుకు 3,326, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన మజ్జి ఆదినారాయణకు 2,945 ఓట్లు, ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన చెల్లూరి చిట్టిబాబుకు 2,855 ఓట్లు లభించాయి. ఇక 1962 ఫిబ్రవరి 19న జరిగిన శాసనసభ ఎన్నికలలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన కోళ్ల అప్పలనాయుడు తన సమీప ప్రత్యర్థి సుంకర సత్యనారాయణపై 5,339 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. అప్పలనాయుడుకు 14,823 ఓట్లు రాగా, జాతీయ కాంగ్రెస్ అభ్యర్థి సుంకర సత్యనారాయణకు 9,484, స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన చెల్లూరి రామారావునాయుడుకు 8,008 ఓట్లు లభించాయి. 1967 సార్వత్రిక ఎన్నికల నాటికి రేవిడి నియోజకవర్గం భీమిలి శాసనసభ నియోజకవర్గంలో విలీనం కావడంతో ఈ గ్రామం పూర్వ నియోజకవర్గ కేంద్రంగా చరిత్రలో నిలిచిపోయింది.

● పద్మనాభం

నేడు జనసేన అసెంబ్లీ అభ్యర్థి సుందరపు నామినేషన్

ఎలమంచిలి, ఏప్రిల్ 17: జనసేన ఎలమంచిలి అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ బుధవారం ఉదయం 10.30 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ తెలిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని తెలిపారు. సుందరపు నామినేషన్ కార్యక్రమానికి మూడు పార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అచ్యుతాపురం మండలం నుంచి ర్యాలీ ప్రారంభమై ఎలమంచిలి పట్టణం వరకూ చేరుకుంటుందన్నారు. నిర్దేశించిన ముహూర్తానికి తహసీల్దారు కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తారని తెలపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సబ్బవరం, ఏప్రిల్ 17 : సబ్బవరం-1 సెక్షన్ పరిధిలోని సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్. రామకృష్ణ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

యోగాతో ఆరోగ్యం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 17 : యోగా వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చనని యోగా మాస్టర్ ట్రైనీ కృష్ణశ్రీ అన్నారు. స్థానిక జార్జిక్లబ్ ఆధ్వర్యంలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న యోగా సహ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం జరిగిన తరగతుల్లో ఆమె మాట్లాడారు. ప్రతి రోజు యోగాసనం సాధన చేయడం వల్ల మీ శ్వాసను, శరీరాన్ని నియంత్రించడంతోపాటు ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు యోగా శిక్షకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై డ్రైవర్లకు అవగాహన

ఎలమంచిలి, ఏప్రిల్ 17: అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు సంభవిస్తే సమయస్ఫూర్తితో ఎలా వ్యవహరించాలో పెట్రోల్ బంకు సిబ్బందికి, వాహన డ్రైవర్లకు బుధవారం అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. ఎలమంచిలి భారత్ పెట్రోల్ బంకు ఆవరణలో అగ్నిమాపక అధికారి రాంబాబు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బంకు సిబ్బంది, డ్రైవర్లు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్‌లో.. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం అగ్నిమాపక శాఖ అధికారి బి. నరసింగరావు తన సిబ్బందితో పట్టణంలో వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. అగ్నిమాపక కేంద్రం నుంచి చిననాలుగురోడ్ల జంక్షన్, పెరుగుబజార్ మీదుగా రింగురోడ్డు జంక్షన్ వరకు ర్యాలీ జరిగింది. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. సంతోషిమాత ఆర్చి వద్ద డెమో నిర్వహించారు. రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, మురికివాడల్లో ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. విపత్తుల స్పందన అగ్నిమాపక అధికారి బి. లక్ష్మణస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

11 గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 17: మండలంలోని కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలోని 11 గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ గోపి తెలిపారు. విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల్లో భాగంగా గుడివాడ, గురాజుపేట, లక్ష్మీపతిరాజుపేట, బంగారమ్మపాలెం, పెదఉప్పలం, చినఉప్పలం, రేవుపోలవరం, కొత్తపోలవరం, అడ్డరోడ్డు తిమ్మాపురం, కోనవానిపాలెం, కొరుప్రోలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ గోపి కోరారు.

తగ్గని భానుడి ప్రతాపం

... 5వ పేజీ తరువాయి

రావికమతం మండలంలో 44.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. గత నాలుగైదు రోజుల నుంచి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు ఈ మండంలోనే నమోదు కావడం గమనార్హం. జిల్లా మొత్తంగా పరిశీలిస్తే చోడవరం, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాల్లోని అన్ని మండలాలతోపాటు మిగిలిన నియోజకవర్గాల్లోని కశింకోట, కోటవురట్ల, గొలుగొండ, మాకవరపాలెం మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీస్తున్నాయి. మండలాల వారీగా గరిష్ఠ ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే.. మాడుగులలో 43.1, గొలుగొండలో 42.9, చోడవరం, చీడికాడల్లో 42.8, మాకవరపాలెం, కశింకోటల్లో 42.5, కోటవురట్ల, రోలుగుంటల్లో 42.4, బుచ్చెయ్యపేటలో 42.1, నర్సీపట్నంలో 41.3, నాతవరంలో 41.2, కె.కోటపాడు, దేవరాపల్లిల్లో 41, సబ్బవరం, అనకాపల్లిల్లో 40.7, పాయకరావుపేటలో 38.8, ఎస్.రాయవరంలో 38.7, ఎలమంచిలిలో 38.3, నక్కపల్లిలో 38.1, మునగపాకలో 38, పరవాడలో 37.9, అచ్యుతాపురంలో 37.5 రాంబిల్లిలో 35.1 డిగ్రీలు నమోదయ్యాయి.

అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం


సీతారాములను దర్శించుకున్న నాగజగదీశ్వరరావు


సీతారాములను దర్శించుకున్న సీఎం రమేశ్ దంపతులు


కల్యాణంలో పూజలు చేస్తున్న రత్నాకర్ దంపతులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 17 : పట్టణంలో సీతారాముల కల్యాణ మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచి పలు వీధులు శ్రీరామ నామ స్మరణతో మార్మోగాయి. స్థానిక చేపల బజారు వద్ద గల రామాలయంలో అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ దంపతులు పూజలు నిర్వహించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి సీతారాములను దర్శించుకున్నారు. అనంతరం శోభయాత్రను ప్రారంభించారు. ఇక్కడ భద్రాచలంలో మాదిరిగానే ఆరుబయట వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య సిరసపల్లి సూరిబాబు దంపతులు రాముల వారి కల్యాణాన్ని నిర్వహించారు. గవరపాలెం పెదరామస్వామి ఆలయంలో తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం కల్యాణాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, పద్మావతి దంపతుల తోపాటు కార్పొరేటర్లు, వీధి పెద్దలు పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, పార్టీ నాయకులతో కలిసి పట్టణంలోని రామాలయాల్లో జరిగిన కల్యాణ వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, సీఎం రమేశ్ తనయుడు సీఎం రిత్విక్ దంపతులు రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి సీతారాములకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అలాగే దిబ్బవీధి, పూడిమడకరోడ్డు, గాంధీనగరం, నీలకంఠరావువీధి, దేమునిగుమ్మం, కోట్నివీధితోపాటు పలు వీధుల్లోని రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు.

అనకాపల్లి రూరల్‌లో.. మండలంలోని తాడికపిలాశ్రమం, సాలాపువానిపాలెం, మారేడుపూడి రామాలయాల్లో సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో దంపతులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. అనంతరం అన్నసమారాధనల్లో భక్తులు పాల్గొన్నారు.

తుమ్మపాలలో.. అనకాపల్లి పట్టణంతోపాటు మండలంలోని గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు అంగరంగ వైభవంగా సాగాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో గల రామాలయాల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు సీతారాములను దర్శించుకున్నారు. తుమ్మపాల గవరపేటవీధి రామాలయం వద్ద శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి.

ఎస్.రాయవరంలో.. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న రామాలయాల్లో బుధవారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎస్.రాయవరం, అడ్డరోడ్డు తిమ్మాపురం, పెట్టుగోళ్లపల్లి, దార్లపూడి, వేమగిరి, సర్వసిద్ధిల్లో రాములోరి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

పరవాడలో.. స్థానిక రామాలయం వద్ద బుధవారం నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, లక్ష్మి దంపతులు పూజలు నిర్వహించారు. సీతారాములకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఎంపీపీ పైలా వెంకటపద్మలక్ష్మి, శ్రీనివాస దంపతులు సీతారాములను దర్శించుకుని పూజలు చేశారు.

కోటవురట్లలో.. మండల కేంద్రంలోని రాట్నాపాలెం ఎస్సీకాలనీ రామాలయంలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. మండలంలో పాములవాక, మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు, కైలాసపట్నం, మాజీ ఎమ్మెల్సీ డీవీ. సూర్యనారాయణరాజు, జడ్పీటీసీ సభ్యురాలు సిద్దాత్తుల ఉమాదేవి దంపతుల ఆధ్వర్యంలో అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు.

నక్కపల్లిలో.. మండలంలోని అనేక గ్రామాల్లో బుధవారం శ్రీరామ నవమి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. నక్కపల్లి, వేంపాడు, ఉద్దండపురం, ఉపమాక మెరకవీధి, పల్లపువీధి, జానకయ్యపేట, సీహెచ్‌ఎల్‌పురం, రేబాక, గొడిచెర్ల, గుల్లిపాడు, అమలాపురం, రాజయ్యపేట, కాగిత, అమలాపురం, తదితర గ్రామాల్లో ఘనంగా సీతారాముల కల్యాణోత్సవాలు జరిగాయి.

అచ్యుతాపురంలో.. రాములోరి కల్యాణాన్ని మండలంలో గ్రామగ్రామాన అత్యంత వైభవంగా నిర్వహించారు. బుధవారం హరిపాలెం, తిమ్మరాజుపేటల్లో అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ రాములోరి కల్యాణంలో పాల్గొన్నారు. గ్రామాల్లో అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

ఎలమంచిలిలో.. శ్రీరామనవమి సందర్భంగా పట్టణం, మండలంలోని రామాలయాల్లో సీతారాముల కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీరామ స్మరణతో ఆలయాలన్నీ మార్మోగాయి. ఎలమంచిలి కొత్తపేట, ధర్మవరం, తులసీనగర్, దిమిలి రోడ్డు జంక్షన్, క్లబ్ రోడ్డు, రామ్‌నగర్, శ్రీరామ్‌నగర్ టిడ్కో గృహ సముదాయం, పెదపల్లి, యర్రవరం ప్రాంతాల్లో శ్రీరామ నవమి వేడుకలు మిన్నంటాయి. పీఎస్‌ఆర్‌పేటలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల కింద సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఏటికొప్పాక, పులపర్తి, పురుషోత్తపురం, లైనుకొత్తూరు, జంపపాలెం, తదితర పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.

శ్రీరాముడికి 133 బిందెల సారె



ఎలమంచిలి, ఏప్రిల్ 17: మండలంలోని పీఎస్ ఆర్. పేట ఉభయ గ్రామాల్లో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో 133 బిందెల సారె ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామానికి చెందిన వ్యాపార వేత్త మొగ్గా సీతారామయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారామయ్య 108 బిందెలకు తోడు గ్రామస్థులు ఇచ్చిన 25 బిందెలతో కలిపి 133 బిందెల సారెను గ్రామవీధుల్లో ఊరేగించారు. అనంతరం గ్రామస్థులు ఈ సారెను పంపిణీ చేయనున్నారు.

బియ్యపు గింజలపై శ్రీరామ నామం



మునగపాక (తుమ్మపాల), ఏప్రిల్ 17 : శ్రీరామనవమి సందర్భంగా నాగులాపల్లి గ్రామానికి చెందిన కర్రి వాసు, యశోద దంపతులు బియ్యపు గింజలపై శ్రీరామ నామాన్ని లిఖించి తమ భక్తిని చాటుకున్నారు. బుధవారం నాగులాపల్లి పాటిమీద రామాలయం వద్ద జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఈ బియ్యపు గింజలను తలంబ్రాలుగా వినియోగించారు. ఈ సందర్భంగా కర్రి వాసు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా బియ్యపు గింజలపై శ్రీరామ నామాన్ని రాసి రామాలయానికి సమర్పించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వాసు దంపతులను పలువురు అభినందించారు.

సుందరపు కుటుంబ సభ్యుల పూజలు

పట్టణంలో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో జనసేన ఎలమంచిలి అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సుందరపు విజయ్‌కుమార్ సతీమణి శైలజ, వదిన దమయంతి, సుందరపు సోదరుడు, సోదరి అంతా కలిసి పట్టణంలోని సీతారాముల దేవాలయాలను దర్శించుకున్నారు.

సబ్బవరంలో.. మండలంలోని పలుగ్రామాల్లోని రామాలయాల్లో బుధవారం సీతారాముల కల్యాణం వేద మంత్రోచ్చారణల మధ్య కనుల పండువగా నిర్వహించారు. సబ్బవరం, గొర్లివానిపాలెం, ఆరిపాక, యాతపాలెం, గుల్లేపల్లి, రావలమ్మపాలెం, మలు నాయుడుపాలెం, మొగలిపురం, పైడివాడ, పైడివాడ అగ్రహారం, అసకపల్లి, బంగారమ్మపాలెం, మలునాయుడు పాలెం తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేడుకల్లో ఎంపీపీ బోకం సూర్యకుమారి, వైస్ ఎంపీపీ రూప్సీ లక్ష్మీరాణి, చొక్కాకుల గోవింద, సర్పంచ్ ఎస్. నారాయణమూర్తి, బోకం రామునాయుడు, గండి దేముడు, దుర్గినాయుడు, రామలక్ష్మి పాల్గొన్నారు.

రాంబిల్లిలో.. శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం మండలంలోని రాంబిల్లి, దిమిలి, హరిపురం, కొత్తపట్నం, వాడనర్సాపురం, గోవిందపాలెం, కొత్త పేట, కొప్పుగొండుపాలెం, చినకలవలాపల్లి, అప్పన్నపాలెం, లాలంకోడూరు, రాజుకోడూరు, హరిపురం, కొత్తూరు, మామిడివాడ, గోకివాడ, మర్రిపాలెం, కట్టుబోలు తదితర గ్రామాల్లో రామాలయాల్లో సీతారాములు వారి కల్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. మర్రిపాలెంలో భక్తులు 40 బిందెలు వంటకాలతో కూడిన సారెను సీతారాములు వారికి సమర్పించారు. అన్నసమారాధన నిర్వహించారు.

పాయకరావుపేటలో.. శ్రీరామ నవమి వేడుకలు బుధవారం పట్టణంలో అత్యంత వైభవంగా జరిగాయి. పట్టణంలోని స్థానిక మంగవరంరోడ్డు, దుర్గానగర్, నాగరాజుపేట, శెట్టిబలిజలవీధి, పట్టుశాలీలవీధిలోని రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మంగవరంరోడ్డు సీతారామాలయంలో బుధవారం రాత్రి సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ఆవరణలో వానర సేన సభ్యులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు సీతారాముల ఉత్సవ మూర్తులకు కల్యాణాన్ని జరిపించారు. ఈ కార్యక్రమంలో ధనిశెట్టి బాబూరావు దంపతులు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో.. మండలంలోని పాల్తేరు, మంగవరం, సత్యవరం, గోపాలపట్నం, మాసాహెబ్‌పేట గ్రామాలలో బుధవారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగించారు.


ఎలమంచిలి ధర్మవరంలోని సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న సుందరపు కుటుంబ సభ్యులు


నక్కపల్లి: ఉపమాకలో సీతారాముల కల్యాణం సందర్భంగా తాళిబొట్టును చూపిస్తున్న అర్చకులు


పాయకరావుపేటలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వడగాడ్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి


నిర్మానుష్యంగా అచ్యుతాపురం-పూడిమడక రోడ్డు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 17: పట్టణంలో అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతూనే ఉన్నాయి. బుధవారం అత్యధిక ఉష్ణోగ్రత 40.5 డిగ్రీలు, అత్యల్ప ఉష్ణోగ్రత 26.6గా నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. ఉదయం నుంచే ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీనికితోడు వడగాడ్పులతో ప్రధాన రహదారులన్నీ జనసందడి లేక బోసిపోయాయి. పాదచారులు, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు ఇబ్బందులు పడక తప్పలేదు. సాయంత్రం నాలుగు గంటలు దాటినా వేడిగాలులు తగ్గకపోవడంతో పట్టణంలోనే ప్రజలే కాకుండా గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

కోటవురట్లలో.. ఒకవైపు ఎండ తీవ్రత, మరోవైపు వడగాడ్పులతో ప్రజలకు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. బుధవారం ఉదయం 9గంటల నుంచి వడగాడ్పులు వీయడంతో ఇళ్లలోంచి బయటకు రావడానికి ప్రజలు భయపడ్డారు. వడగాడ్పులు, ఉక్కపోతకు వృద్ధులు, పిల్లలు ఆపసోపాలు పడ్డారు. వారం రోజుల నుంచి ఉదయం 9గంటల దాటితే ఎండలో నడవలేక పాదచారులు, మహిళాలు అవస్థలు పడుతున్నారు. వడగాడ్పులు వీస్తుండడంతో మధ్యాహ్న సమయాల్లో కోటవురట్ల మెయిన్ రోడ్డు నిర్మానుష్యంగా కనిపిస్తున్నది.

అచ్యుతాపురంలో.. ఎండ తీవ్రతకు మండల ప్రజలు విలవిలలాడారు. బుధవారం ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండ తీవ్రత ప్రారంభమైంది. పది గంటలకు ఎవరూ ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. బయట గాలి లేకపోవడంతో ఉక్కపోతతో ప్రజలు ఇళ్లలో కూడా ఉండలేకపోయారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి వడగాడ్పులు ప్రారంభమయ్యాయి. ఎప్పుడూ వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే అచ్యుతాపురం రోడ్లు 12 గంటలకు ఖాళీ అయిపోయాయి. సెజ్‌లో కర్మాగారాలకు వచ్చే భారీ వాహనాలు చెట్లకింద ఆపేశారు. ఎండ వేడిమికి తలపై ప్రజలు తువ్వాళ్లు కప్పుకుంటున్నారు. సాయంత్రం ఐదున్నర వరకు ఎండవేడి తగ్గలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కలగానే ఫిష్ ల్యాండింగ్ సెంటర్

... 5వ పేజీ తరువాయి

సమాచారం అందింది. ఎఫ్‌ఎల్‌సీ ఏర్పాటుకు అయ్యే వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తి చొప్పున భరించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ప్రకారం కేంద్ర ప్రభుత్వం రూ.14.86 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ రూ.9.91 కోట్లు ఖర్చు చేయాల్సి వుంటుంది. ఈ నిధులతో చేపల వేలంపాటకు హాలు, చేపలు ఎండబెట్టుకోవడానికి ప్లాట్‌ఫారాలు, సామాజిక భవనం, మత్స్యకారులు వలలు బాగుచేసుకోవడానికి భవనం, విశ్రాంతి తీసుకునేందుకు గదులు, మరుగుదొడ్లు, చేపల నిల్వకు శీతలీకరణ గోదాములు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ప్రధాన రహదారి వరకు సీసీ రోడ్ల నిర్మాణం చేపడతారు. ఏడాదిలో పనులు పూర్తవుతాయని, మత్స్యకారులకు ఎఫ్‌ఎల్‌సీ అందుబాటులోకి వస్తుందని నాడు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రకటించారు. ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం జరిగితే రాజయ్యపేట, దొండవాడ, బోయపాడు, అమలాపురం పరిసర గ్రామాల్లో సుమారు ఐదు వేల మంది మత్స్యకారులకు ప్రత్యక్షంగా, మరో రెండు వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని చెప్పారు.

భూ సేకరణలో తీవ్రజాప్యం

ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి ఆరు ఎకరాలు అవసరమని మత్స్య శాఖ అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు రాజయ్యపేట సముద్ర తీరంలో భూమిని గుర్తించారు. ఇక్కడ సముద్ర తీర ప్రాంతం అటవీ శాఖ పరిధిలో వుండడంతో దీనిని ఆరు ఎకరాల భూమిని తమ శాఖకు అప్పగించేలా చర్యలు చేపట్టాలని మత్స్యశాఖ అధికారులు సుమారు రెండేళ్ల క్రితం జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వంగా లేఖ రాశారు. ఆ మేరకు కలెక్టరేట్ అధికారులు నోట్ ఫైల్ తయారు చేసి అటవీ శాఖకు పంపారు. తరువాత జిల్లా కలెక్టర్, జేసీ, ఆర్డీవో, మత్స్యశాఖ అధికారులు పలుమార్లు రాజయ్యపేట వచ్చి ఫిష్ ల్యాండింగ్ కేంద్రం ఏర్పాటుకు ఎంపిక చేసిన భూమిని పరిశీలించారు. కానీ అటవీ శాఖ నుంచి ఎటువంటి స్పందన రాలేదు. దీంతో ఆరు ఎకరాలు కాకపోయినా.. కనీసం మూడు ఎకరాలు కేటాయిస్తే చాలని, ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణ పనులు చేపడతామని మత్స్యశాఖ అధికారులు, అటవీ శాఖ అధికారులను కోరారు. అయినా సరే ఫలితం లేకపోయింది.

ఎన్నికలకు నగారా

... 5వ పేజీ తరువాయి

సువిధ యాప్ ద్వారా కూడా నామినేషన్ పత్రాలు సమర్పించే అవకాశం ఉంది. కానీ ఆన్‌లైన్‌లో సమర్పించిన ఫారం-2బీ, ఇతర కాపీలను ప్రింట్ తీసి ఆర్‌ఓకు తప్పనిసరిగా అందజేయాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు అయితే రూ.5 వేలు, ఇతరులు రూ.10 వేలును డిపాజిట్‌గా ఆర్‌ఓ కార్యాలయంలో జమ చేయాలి. నామినేషన్ వేసే అభ్యర్థి తరపున మూడు వాహనాలను మాత్రమే ఆర్‌ఓ కార్యాలయంలోకి అనుమతిస్తారు. అభ్యర్థితోపాటు ఐదుగురిని మాత్రమే ఆర్‌ఓ చాంబర్‌లోకి అనుమతిస్తారు.

పట్నంలో డ్రైనేజీలు అస్తవ్యస్తం

... 5వ పేజీ తరువాయి

భారీ వర్షాలు కురిస్తే ఆర్టీసీ కాంప్లెక్స్, తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా మోకాళ్లలోతు మురుగు నీరు పారుతుంది. నర్సీపట్నం- కృష్ణాదేవిపేట రోడ్డులో డ్రైనేజీలు పూర్తిగా పూడుకుపోయాయి. అప్పుడప్పుడు పూడికతీత పనుల పేరుతో లక్షల రూపాయలు వృథా చేస్తున్నారు తప్పితే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. ప్రశాంతి నగర్, బ్యాంక్ కాలనీ, శారదా నగర్, బొంతువీధి, శివపురం తదితర ప్రాంతాల్లో డ్రైనేజీలు సరిగ్గా లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు.

అటకెక్కిన డీపీఆర్

2015లో అప్పటి టీడీపీ పాలకవర్గం మునిసిపాలిటీలో డ్రైనేజీ అభివృద్ధి కోసం హైదరాబాద్‌కు చెందిన ఎస్‌కే అసోసియేట్స్ సంస్థతో డిటైల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) తయారు చేయించారు. కాంప్రహెన్సివ్ స్మార్ట్ డ్రైనేజీ స్కీమ్ కింద 27 వార్డులను(ఇప్పుడు 28 వార్డులు) 12 జోన్లుగా విభజించారు. మునిసిపాలిటీలో 209 కిలో మీటర్లు డ్రైనేజీలు, 2,935 మీటర్లు కల్వర్టులు అవసరమని పేర్కొన్నారు. డ్రైనేజీ అభివృద్ధికి రూ.96 కోట్లు నిధులు అవసరమని అంచనాలు వేశారు. మురుగునీరు శుద్ధి చేయడానికి రూ.6.5 కోట్లతో జోగినాథునిపాలెం వద్ద 60 లక్షల లీటర్ల సామర్థ్యం గల సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించాలని ప్రతిపాదించారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ పాలకవర్గం కూడా డీపీఆర్ రివైజ్ చేయించి ప్రభుత్వానికి నివేదిక పంపించడానికి ప్రయత్నం చేయలేదు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక


వైసీపీ నేత దాడి కృష్ణ, అనుచరులు టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ప్రగడ, పప్పల చలపతిరావు

ఎలమంచిలి, ఏప్రిల్ 17: మునిసిపాలిటీలోని కొత్తపాలెం వార్డులో 40 మంది వైసీపీ నుంచి టీడీపీలో బుధవారం చేరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో విశాఖ డెయిరీ మాజీ చైర్మన్ దాడి సూర్య జగన్నాథరావు (కృష్ణ), దాడి రమేష్, దాడి జగదీష్, మళ్ల రామకృష్ణ తదితరులందరికీ ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఆడారి ఆదిమూర్తి, ఆడారి రమణబాబు, రాజాన నారాయణమ్మ, ఎస్.సుబ్బయ్యనాయుడు, కరణం రవి పాల్గొన్నారు.

నక్కపల్లిలో నామినేషన్లకు ఏర్పాట్లు

నక్కపల్లి, ఏప్రిల్ 17: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పాయకరావుపేట నియోజకవర్గం ఎన్నికల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 18వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరించేందుకు ఆర్వో కె.గీతాంజలి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపడుతున్నారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితోపాటు ప్రతిపాదిత, ఆమోదించే వారు తప్ప ఇతరులెవ్వరినీ లోపలకు అనుమతించకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. పోలీస్ బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తున్నారు. అనంతరం సాయంత్రం రాజకీయపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఇందులో తహసీల్దార్ శ్రీకాంత్, డీటీ చైనులు పాల్గొన్నారు.

ముగిసిన లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు


సామూహిక కుంకుమ పూజ చేస్తున్న భక్తులు

సబ్బవరం, ఏప్రిల్ 17 : మండలంలోని దేవీపురం శ్రీసహస్రాక్షి రాజరాజేశ్వరిదేవి పీఠంలో జరుగుతున్న లలితాంబికా నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీలలిత సహస్ర నామావళి హోమం, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం సీతా, లక్ష్మణ, ఆంజనేయ సహిత రామచంద్ర షోడశోపచార పూజ కన్నుల పండువలా నిర్వహించారు. గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శ్రీవిద్య ట్రస్టు నిర్వాహకులు కందర్ప రమా, ప్రభాకర్, భక్తులు పాల్గొన్నారు.

జనసేన ఎలమంచిలి లీగల్ సెల్ అధ్యక్షుడిగా శివశంకర్



రాంబిల్లి, ఏప్రిల్ 17 : జనసేన పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ లీగల్‌సెల్ అధ్యక్షుడిగా మండలంలోని గోకివాడ గ్రామానికి చెందిన న్యాయవాది పొట్నూరి శివశంకర్ నియమితులయ్యారు. సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ 21 నియోజకవర్గాలకు లీగల్ సెల్ కార్యకలాపాలు నిర్వహించేందుకు అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పవన్‌కల్యాణ్, సుందరపు విజయకుమార్‌లకు శివశంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

క్షేత్రస్థాయిలో బీజేపీ మరింత బలోపేతానికి కృషి

పార్టీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు


విలేకరులతో మాట్లాడుతున్న పరమేశ్వరరావు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 17 : బీజేపీ కేంద్ర కమిటీ ప్రకటించిన మేనిఫెస్టోను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి పార్టీని మరింత బలోపేతం చేస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు చెప్పారు. బుధవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలతోపాటు ఈ దఫా మేనిఫెస్టోలో మరికొన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో 30 హామీలను ప్రకటించారన్నారు. దేశంలో తొలివిడతగా కోటి ఇళ్లకు సోలార్ ద్వారా ఉచిత విద్యుత్ సౌకర్యం పేదలకు కల్పించనున్నామన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత బీజేపీదేనన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు పొన్నగంటి అప్పారావు, ఈర్లె శ్రీరామ్మూర్తి, చిట్టిబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం


కొత్తూరులో జబర్దస్త్ టీమ్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 17 : పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతంలో కూటమి అభ్యర్థుల విజయానికి జబర్దస్త్ కళాకారులు ఆటో రాంప్రసాద్, గెటప్ శ్రీనులు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విజయరామరాజుపేటలో వీరిద్దరూ కూటమి నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణలను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా తెలుగుదేశంపార్టీ నాయకులు రాంప్రసాద్, శ్రీనులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యల్లంకి సత్తిబాబు, పోలారపు త్రినాథ్ పాల్గొన్నారు.

తుమ్మపాలలో.. జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణకు మద్దతు పలుకుతూ జబర్దస్ టీమ్ సభ్యులు గెటప్ శ్రీను, ఆటో రాంప్రసాద్ బుధవారం కొత్తూరు, బీఆర్టీకాలనీ, రామాపురం, పిసినికాడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. జబర్దస్ ఆర్టిస్టులకు మహిళలు హారతులతో స్వాగతం పలికారు.

వైసీపీ రాక్షస పాలనకు చరమగీతం పాడాలి

టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 17: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత, అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు కోరారు. మండలంలోని మాసాహెబ్‌పేట, రాజవరం గ్రామాలలో బుధవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో జనసేన, బీజేపీ మండల అధ్యక్షులు యగదాసు నానాజీ, వేముల వెంకటరమణ, టీడీపీ నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు, బొంది కాశీవిశ్వనాథ్, జనసేన నాయకులు నారపురెడ్డి పద్మ, మానివెల్లి మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


నర్సీపట్నం :అబీద్ సెంటర్ రామాలయం వద్ద సీతారాముల కల్యాణం


నర్సీపట్నం అర్బన్ : ధర్మసాగరంలో అయ్యన్న, సీఎం రమేష్ పూజలు


చోడవరం: బెన్నవోలు రామాలయంలో సీతారాముల కల్యాణం దృశ్యం


చీడికాడ రామాలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి

కల్యాణ వైభోగమే..

- గ్రామ గ్రామాన నేత్రపర్వంగా నవమి వేడుకలు
- వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ సీతారాముల కల్యాణం
- కన్నులారా వీక్షించి తరించిన భక్తజనం
- భారీ ఏర్పాట్లు చేపట్టిన నిర్వాహకులు
- పులిహోర, పానకం ప్రసాదంగా పంపిణీ


మాడుగుల : వీరవల్లి అగ్రహారం రామాలయంలో...


బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో...


కె.కోటపాడు రాములవారి ఆలయంలో...


రావికమతం మండలం కొత్తకోట గుమ్ముడి వీధి రామాలయంలో సీతారాముల కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకస్వాములు


గొలుగొండ మండలం చీడిగుమ్మల ఆలయంలో...

నర్సీపట్నం/నర్సీపట్నం అర్బన్, ఏప్రిల్ 17 : శ్రీరామ నవమిని నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల ప్రజలు బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి రామాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. స్వామి దర్శనాలకు భక్తులు పోటెత్తడంతో ఎటుచూసినా కోలాహల వాతావరణం కనిపించింది. ఆలయాల నిర్వాహకులు చలిమిడి, వడపప్పు, పానకం, పులిహోర వంటి వాటిని ప్రసాదాలుగా పంపిణీ చేశారు. నర్సీపట్నంలో ఈ వేడుకను అంగరంగవైభవంగా జరిపారు. పాత బస్టాండ్ ప్రాంతంలోని పురాతన సీతారాముల ఆలయం, వెంకునాయుడుపేట, వెలమవీధి, రామారావుపేట, అబీద్ సెంటర్‌లోని అయ్యరక రామమందిరం, కొత్తవీధి తదితర ప్రాంతాలలోని ఆలయాలలో అర్చకులు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పలు రామాలయాలకు రామ ధ్వజాలు, ప్రసాద వితరణకు రూ.రెండువేలు అందజేశారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు కట్టమూరి శేఖర్, డాక్టర్ రామచంద్రరాజు, వెలగా నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, మండలంలోని గ్రామ గ్రామాన సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ధర్మసాగరం ఆలయంలో జడ్పీటీసీ సుకల రమణమ్మ ఆధ్వర్యంలో ఈ వేడుకను జరిపారు. మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడితో పాటు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అనకాపల్లి పార్లమెంటు అభ్యర్థి సీఎం రమేష్ హాజరై దర్శించుకున్నారు. తొలుత జడ్పీటీసీ రమణమ్మ, గ్రామస్థులు వీరికి స్వాగతం పలికారు.

నాతవరం : సీతారాముల కల్యాణాన్ని మండలంలోని గ్రామ గ్రామాన నిర్వహించారు. నాతవరంలో గుండా రాజా, లావణ్య దంపతుల ఆధ్వర్యంలో మరింత ఘనంగా జరిపారు. వెన్నలపాలెం, గుమ్మిడిగొండ తాండవ తదితర గ్రామాల్లోని రామాలయాల్లో స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

గొలుగొండ/కృష్ణాదేవిపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. గొలుగొండ, చీడిగుమ్మల, రావణాపల్లి, ఏటిగైరంపేట, గుండుపాల, కొత్తఎల్లవరం, ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, సీహెచ్‌నాగాపురం, లింగంపేట, కొంగశింగి, చోద్యం తదితర గ్రామాల్లో జరిగిన ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై సీతారాములను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేపట్టారు.

మాకవరపాలెం : మండలంలోని పలు గ్రామాల్లో గల రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకులను ఘనంగా నిర్వహించారు. మాకవరపాలెం రామాలయం వద్ద సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు వీక్షించి, తరించారు. తామరం, కొండలఅగ్రహారం, రాచపల్లి, గిడుతూరు, తూటిపాల, శెట్టిపాలెం, భీమబోయినపాలెం తదితర గ్రామాల్లోనూ ఈ వేడుకలు జరిగాయి.

చోడవరం : మండలంలోని గ్రామ గ్రామాన శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ సీతారాముల కల్యాణాన్ని జరిపారు. ఈ వేడుకను పెద్ద సంఖ్యలో వీక్షించి తరించారు.

బుచ్చెయ్యపేట : మండల వ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలను వైభవోపేతంగా నిర్వహించారు. బుచ్చెయ్యపేట, మంగళాపురం, విజయరామరాజుపేట, వడ్డాది, ఎల్‌బీపీ అగ్రహారం, కోమళ్లపూడి, దిబ్బిడి, కొండపాలెం, పొలేపల్లి, రాజాం, నీలకంఠాపురం, గున్నెంపూడి, కొండెంపూడి, పొట్టిదొరపాలెం, పి.భీమవరం, చిట్టియ్యపాలెం, ఆర్.శివరామపురం, ఆర్.భీమవరం, మల్లాం తదితర గ్రామాల్లో గల రామాలయాల్లో సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రావికమతం : శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని మండలంలోని గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించారు. రావికమతంలోని గంజివారి రామాలయంలో, దొండపూడిలోని రెండు రామాలయాల్లో, మరుపాకతో పాటు కొత్తకోట గుమ్ముడు వీధి, శివకేశవ ఆలయం, మర్రివలస, కన్నంపేట. టి.అర్జాపురం, తోటకూరపాలెం, గుడ్డిప, నాగన్నపాలెం తదితర ఆలయాల్లో ఈ వేడుకలను జరిపించారు.

రోలుగుంట : శ్రీరామ నవమి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. రోలుగుంట, కొమరవోలు, కొండపాలెం, కుసర్లపూడి, కొవ్వూరు, బుచ్చెంపేట, శరభవరం తదితర గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణాన్ని కన్నులపండువగా జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి వేడుకలను వీక్షించారు.

మాడుగుల/మాడుగుల రూరల్ : శ్రీరామ నవమిని మండల వ్యాప్తంగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. భక్తులకు చలిమిడి, వడపప్పు, పానకాలు, పులిహోర తదితరాలను ప్రసాదాలు పంచిపెట్టారు. ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దేవరాపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలుచోట్ల సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. తారువ గ్రామంలోని రామాలయంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నసమారాధనలో పాల్గొన్నారు. దేవరాపల్లి రామాయం వద్ద ఆలయ ధర్మకర్త కిలపర్తి భాస్కరరావు ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిపారు.

చీడికాడ : మండల కేంద్రం చీడికాడతో పాటు అన్ని గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి స్వామివారికి విశేష పూజలు జరిపారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. చీడికాడ, తురువోలు గ్రామాల్లోని ఆలయాల్లో జరిగిన పూజల్లో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సోదరుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : శ్రీరామ నవమిని మండల వాసులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఊరూరా రామాలయాల వద్ద చలువ పందిళ్లు వేసి సీతారాముల కల్యాణాన్ని సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి వేడులకలను కన్నులారా వీక్షించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు.

ఏఎల్‌పురంలో తాగునీరు వృథా



కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 17 : ఏఎల్‌పురంలో తాగునీరు వృథాగా పోతోంది. వీధి కుళాయిలకు నీటిని అందించే పైప్‌లైన్ పలుచోట్ల లీకేజీల కారణంగా ఈ సమస్య తలెత్తింది. ముఖ్యంగా ఏఎల్‌పురంలో గల కొంగసింగి రహదారిలో వారం రోజులుగా పెద్ద ఎత్తున నీరు నేలపాలవుతోంది. అయినప్పటికీ కన్నెత్తి చూసేవారు కరువయ్యారు. అసలే వేసవి కాలం కావడంతో ఎండలు ముదిరి, పలుచోట్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఈ పరిస్థితుల్లో నీరు వృథాగా పోతున్నా అధికారుల్లో స్పందన లేకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కలగానే ఫిష్ ల్యాండింగ్ సెంటర్

... 5వ పేజీ తరువాయి

సమాచారం అందింది. ఎఫ్‌ఎల్‌సీ ఏర్పాటుకు అయ్యే వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తి చొప్పున భరించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ప్రకారం కేంద్ర ప్రభుత్వం రూ.14.86 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ రూ.9.91 కోట్లు ఖర్చు చేయాల్సి వుంటుంది. ఈ నిధులతో చేపల వేలంపాటకు హాలు, చేపలు ఎండబెట్టుకోవడానికి ప్లాట్‌ఫారాలు, సామాజిక భవనం, మత్స్యకారులు వలలు బాగు చేసుకోవడానికి భవనం, విశ్రాంతి తీసుకునేందుకు గదులు, మరుగుదొడ్లు, చేపల నిల్వకు శీతలీకరణ గోదాములు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ప్రధాన రహదారి వరకు సీసీ రోడ్ల నిర్మాణం చేపడతారు. ఏడాదిలో పనులు పూర్తవుతాయని, మత్స్యకారులకు ఎఫ్‌ఎల్‌సీ అందుబాటులోకి వస్తుందని నాడు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రకటించారు. ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం జరిగితే రాజయ్యపేట, దొండవాడ, బోయపాడు, అమలాపురం పరిసర గ్రామాల్లో సుమారు ఐదు వేల మంది మత్స్యకారులకు ప్రత్యక్షంగా, మరో రెండు వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని చెప్పారు.

భూ సేకరణలో తీవ్రజాప్యం

ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి ఆరు ఎకరాలు అవసరమని మత్స్య శాఖ అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు రాజయ్యపేట సముద్ర తీరంలో భూమిని గుర్తించారు. ఇక్కడ సముద్ర తీర ప్రాంతం అటవీ శాఖ పరిధిలో వుండడంతో దీనిని ఆరు ఎకరాల భూమిని తమ శాఖకు అప్పగించేలా చర్యలు చేపట్టాలని మత్స్యశాఖ అధికారులు సుమారు రెండేళ్ల క్రితం జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వంగా లేఖ రాశారు. ఆ మేరకు కలెక్టరేట్ అధికారులు నోట్ ఫైల్ తయారు చేసి అటవీ శాఖకు పంపారు. తరువాత జిల్లా కలెక్టర్, జేసీ, ఆర్డీవో, మత్స్యశాఖ అధికారులు పలుమార్లు రాజయ్యపేట వచ్చి ఫిష్ ల్యాండింగ్ కేంద్రం ఏర్పాటుకు ఎంపిక చేసిన భూమిని పరిశీలించారు. కానీ అటవీ శాఖ నుంచి ఎటువంటి స్పందన రాలేదు. దీంతో ఆరు ఎకరాలు కాకపోయినా.. కనీసం మూడు ఎకరాలు కేటాయిస్తే చాలని, ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణ పనులు చేపడతామని మత్స్యశాఖ అధికారులు, అటవీ శాఖ అధికారులను కోరారు. అయినా సరే ఫలితం లేకపోయింది.

పట్నంలో డ్రైనేజీలు అస్తవ్యస్తం

... 5వ పేజీ తరువాయి

భారీ వర్షాలు కురిస్తే ఆర్టీసీ కాంప్లెక్స్, తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా మోకాళ్లలోతు మురుగు నీరు పారుతుంది. నర్సీపట్నం- కృష్ణాదేవిపేట రోడ్డులో డ్రైనేజీలు పూర్తిగా పూడుకుపోయాయి. అప్పుడప్పుడు పూడికతీత పనుల పేరుతో లక్షల రూపాయలు వృథా చేస్తున్నారు తప్పితే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. ప్రశాంతి నగర్, బ్యాంక్ కాలనీ, శారదా నగర్, బొంతువీధి, శివపురం తదితర ప్రాంతాల్లో డ్రైనేజీలు సరిగ్గా లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు.

అటకెక్కిన డీపీఆర్

2015 సంవత్సరంలో అప్పటి టీడీపీ పాలకవర్గం నర్సీపట్నం మునిసిపాలిటీలో డ్రైనేజీ అభివృద్ధి కోసం హైదరాబాద్‌కు చెందిన ఎస్‌కే అసోసియేట్స్ సంస్థతో డిటైల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) తయారు చేయించారు. కాంప్రహెన్సివ్ స్మార్ట్ డ్రైనేజీ స్కీమ్ కింద 27 వార్డులను(ఇప్పుడు 28 వార్డులు) 12 జోన్లుగా విభజించారు. మునిసిపాలిటీలో 209 కిలో మీటర్లు డ్రైనేజీలు, 2,935 మీటర్లు కల్వర్టులు అవసరమని డీపీఆర్‌లో పేర్కొన్నారు. డ్రైనేజీ అభివృద్ధికి రూ.96 కోట్లు నిధులు అవసరమని అంచనాలు వేశారు. మురుగునీరు శుద్ధి చేయడానికి రూ.6.5 కోట్లతో జోగినాథునిపాలెం వద్ద 60 లక్షల లీటర్ల సామర్థ్యం గల సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించాలని ప్రతిపాదించారు. అయితే డ్రైనేజీ అభివృద్ధికి తయారు చేసిన డీపీఆర్‌ను ప్రభుత్వానికి పంపలేదు. ఆ తరువాత వచ్చిన వైసీపీ పాలకవర్గం కూడా డీపీఆర్ రివైజ్ చేయించి ప్రభుత్వానికి నివేదిక పంపించడానికి ప్రయత్నం చేయలేదు. డ్రైనేజీల సమస్యతో పాటు దోమల బెడదతో ప్రజలు ఇబ్బంది పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు.

నిఘా నీడలో సబ్ కలెక్టర్ కార్యాలయం

- ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ప్రారంభం
- సీసీ కెమెరాలు ఏర్పాటు
- నేటి నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- కార్యాలయంలోకి అభ్యర్థితో సహా ఐదుగురికి మాత్రమే అనుమతి



నర్సీపట్నంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం

నర్సీపట్నం, ఏప్రిల్ 17 : అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఆర్డీవో చాంబర్, కోర్టు హాల్, వరండాలో సీసీ కెమెరాలు అమర్చారు. గురువారం నుంచి 25 వరకు ఉదయం పదకొండు నుంచి మధ్యాహ్నం మూడు గంటలు వరకు నామినేషన్లు వేసుకోవచ్చు. 29 తేదీ వరకు నామినేన్లు ఉపసంహరణకు గడువు ఉంది. ఈ సమయంలో సబ్ కలెక్టర్ కార్యాలయం లోపలకు పోటీ చేసే అభ్యర్థితో సహా ఐదుగురిని మాత్రమే అనుమతిస్తారు. మిగిలిన అనుచరగణం, వారి వాహనాలు సబ్ కలెక్టర్ కార్యాలయానికి వంద మీటర్లు దూరంలో ఆగి పోవాలని రిటర్నింగ్ అధికారి జయరాం తెలిపారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి తరుపున మూడు వాహనాలు వరకు మాత్రమే అనుమతి ఉంటుంది. నామినేషన్లు దాఖలు చేసే సమయంలో ఇతరులు ఎవ్వరినీ కార్యాలయంలోకి అనుమతించరు. ఒక అభ్యర్థి రెండు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది. ఒకరు నాలుగు సెట్లు నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చు. అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థి సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.పది వేలు చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీలు రూ.ఐదు వేలు డిపాటిట్ చెల్లిస్తే సరిపోతుంది. నామినేషన్ వేసే అభ్యర్థిపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు అయితే వ్యక్తిగతంగా అఫడవిట్ దాఖలు చేయడంతో పాటు పేపరు ప్రకటన ఇవ్వాల్సి ఉంది. ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోపడి నామినేషన్‌లు ప్రక్రియ కొనసాగుతున్న సబ్ కలెక్టర్ కార్యాలయంలో పగడ్బందీ ఏర్పాట్ల చేపట్టారు.

టీడీపీ హయాంలోనే శెట్టిపాలెం అభివృద్ధి

- ఎన్నికల ప్రచార సభలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్


శెట్టిపాలెం ప్రచార సభలో మాట్లాడుతున్న విజయ్

మాకవరపాలెం, ఏప్రిల్ 17 : టీడీపీ హయాంలోనే శెట్టిపాలెం అభివృద్ధి చెందిందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. శెట్టిపాలెంలో బుధవారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో నాలుగు కోట్ల రూపాయాలతో గ్రామంలో అభివృద్ధి పనులు చేసినట్టు చెప్పారు. అలాగే, ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. వైసీపీ పాలనలో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయని ఎద్దేవా చేశారు. మళ్లీ గ్రామాలకు పూర్వవైభవం రావాలంటే ఈ ఎన్నికల్లో నర్సీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న అయ్యన్న పాత్రుడ్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరారు. ఈ నెల 19వ తేదీన అయ్యన్న పాత్రుడు నామినేషన్ వేయనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు, భీమబోయినపాలెం సర్పంచ్ రుత్తల నందకిశోర్‌తో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'అభివృద్ధికి మరోసారి అవకాశం ఇవ్వండి'

మాడుగుల, ఏప్రిల్ 17 : నియోజకవర్గాన్ని ఐదేళ్లలో అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన తనను ఈ ఎన్నికల్లో గెలిపించాల్సిందిగా వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో ఉన్న బూడి ముత్యాలనాయుడు కోరారు. మాడుగులలో నిర్వహించి పలు సంఘాల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు మరింత సేవ చేసేందుకు తనను, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థినిగా పోటీచేస్తున్న అనూరాధను ఆశీర్వదించాలన్నారు. ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం, పార్టీ మండల అధ్యక్షుడు పెదబాబు, సర్పంచ్ యద్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎంపీపీ స్కూల్ వార్షికోత్సవం

నర్సీపట్నం, ఏప్రిల్ 17 : పట్టణంలోని వెంకునాయుడుపేట ఎంపీపీ స్కూల్ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు డ్యాన్స్‌లతో జోష్‌పుట్టించారు. ఎలమంచలి డిప్యూటీ డీఈవో అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'పెట్రోల్ బంకుల వద్ద సెల్ ఫోన్ వాడరాదు'

నర్సీపట్నం, ఏప్రిల్ 17 : పెట్రోల్ బంకుల వద్ద సెల్‌ఫోన్ వాడరాదని నర్సీపట్నం అగ్నిమాపక అధికారి పి.అప్పలస్వామి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా బుధవారం పట్టణంలోని పెట్రోల్ బంకులలో అగ్ని ప్రమాదాలు, తీసుకోవల్సిన జాగ్రత్తలుపై అవగాహన కల్పించి, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్ బంకుల వద్ద నో స్మోకింగ్, నో మొబైల్స్ బోర్డులు తప్పని సరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇసుకతో నింపిన బకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అలాగే అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పెట్రోల్, డీజిల్ ట్యాంకులను ప్రతి ఆరు నెలలకు ఒకసారి శుభ్రం చేసుకుంటే ఎటువంటి ప్రమాదాలు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

తగ్గని భానుడి ప్రతాపం

... 5వ పేజీ తరువాయి




చీడికాడ, మాకవరపాలెంలలో మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఉన్న దృశ్యం

రావికమతం మండలంలో 44.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. గత నాలుగైదు రోజుల నుంచి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు ఈ మండంలోనే నమోదు కావడం గమనార్హం. జిల్లా మొత్తంగా పరిశీలిస్తే చోడవరం, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాల్లోని అన్ని మండలాలతోపాటు మిగిలిన నియోజకవర్గాల్లోని కశింకోట, కోటవురట్ల, గొలుగొండ, మాకవరపాలెం మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీస్తున్నాయి.

మండలాల వారీగా గరిష్ఠ ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే.. మాడుగులలో 43.1, గొలుగొండలో 42.9, చోడవరం, చీడికాడల్లో 42.8, మాకవరపాలెం, కశింకోటల్లో 42.5, కోటవురట్ల, రోలుగుంటల్లో 42.4, బుచ్చెయ్యపేటలో 42.1, నర్సీపట్నంలో 41.3, నాతవరంలో 41.2, కె.కోటపాడు, దేవరాపల్లిల్లో 41, సబ్బవరం, అనకాపల్లిల్లో 40.7, పాయకరావుపేటలో 38.8, ఎస్.రాయవరంలో 38.7, ఎలమంచిలిలో 38.3, నక్కపల్లిలో 38.1, మునగపాకలో 38, పరవాడలో 37.9, అచ్యుతాపురంలో 37.5 రాంబిల్లిలో 35.1 డిగ్రీలు నమోదయ్యాయి.

నేడు ముకుందపురం నుంచి 'బండారు' భారీ ర్యాలీ

మాడుగుల, ఏప్రిల్ 17 : మాడుగుల అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీ అధిష్ఠానం ఖరారు చేసిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మండలంలోని ముకుందపురం నుంచి మాడుగుల మోదకొండమ్మ ఆలయం వరకూ గురువారం భారీ ర్యాలీ నిర్వహించనున్నారని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ తెలిపారు. నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్న ర్యాలీకి తరలి రావాల్సిందిగా వారు పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాతవరం, ఏప్రిల్ 17 : మండల కేంద్రం నాతవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం సరాఫరాను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణారావు తెలిపారు. ఈ సబ్ స్టేషన్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కారణంగా ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు నాతవరం, మర్రిపాలెం, వెన్నలపాలెం, గుమ్మిడిగొండ తదితర గ్రామాలకు విద్యుత్ సరవరా ఉండదని వివరించారు.

పేకాట ఆడుతున్న ముగ్గురి అరెస్టు

రావికమతం, ఏప్రిల్ 17 : కిత్తంపేట శివారులో పేకాట ఆడుతున్న ముగ్గుర్ని శుక్రవారం అరెస్టు చేసినట్టు కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. గ్రామ శివారు తోటల్లో తరుచూ పేకాట జరుగుతున్నట్టు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు సిబ్బదితో దాడి చేసి ముగ్గుర్ని అరెస్టు చేసి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

'వడ్డాది పంచాయతీలో అక్రమాలు'

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 17 : వడ్డాది పంచాయతీలో అక్రమాల చోటుచేసుకున్నాయని జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, వార్డు సభ్యులు గరికిపాటి బాలాజీ, అడపా వరహాలుబాబు, ఉల్లి భవానీ తదితరులు ఆరోపించారు. బుధవారం వారు ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా సాల్వెన్సీ లేకుండా వడ్డాది వారపు సంత ఆశీలు పాటను ఖరారు చేశారని, పంచాయతీ సమావేశంలో అజెండాల్లో అంశాలు కాకుండా వేర్వేరు తీర్మానాలు ఆమోదించారని వివరించారు. పంచాయతీల్లో అక్రమాలకు సర్పంచ్, ఉప సర్పంచ్‌లు కోరుకొండ కామలక్ష్మి, దాడి సూర్యనాగేశ్వరరావులే బాధ్యులని ఆరోపించారు. వీటిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో పలువురు వార్డు సభ్యులతో పాటు వడ్డాది పట్టణ వైసీపీ అధ్యక్షుడు దొండా నారాయణరావు, వడ్డాది పీఏసీఎస్ చైర్‌పర్సన్ కోవెల ఈశ్వరరావు పాల్గొన్నారు.

భజన బృందానికి చీరలు పంపిణీ

మాకవరపాలెం, ఏప్రిల్ 17 : బూరుగుపాలెంలో శ్రీరామాంజనేయ భజన బృందానికి టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి చిరంజీవి బుధవారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్నేళ్లుగా పలు గ్రామాల్లో శ్రీరాముని భజన పాటలు పాడుతూ పేరు పొందారన్నారు.

ఎన్నికలకు నగారా

... 5వ పేజీ తరువాయి

సువిధ యాప్ ద్వారా కూడా నామినేషన్ పత్రాలు సమర్పించే అవకాశం ఉంది. కానీ ఆన్‌లైన్‌లో సమర్పించిన ఫారం-2బీ, ఇతర కాపీలను ప్రింట్ తీసి ఆర్‌ఓకు తప్పనిసరిగా అందజేయాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు అయితే రూ.5 వేలు, ఇతరులు రూ.10 వేలును డిపాజిట్‌గా ఆర్‌ఓ కార్యాలయంలో జమ చేయాలి. నామినేషన్ వేసే అభ్యర్థి తరపున మూడు వాహనాలను మాత్రమే ఆర్‌ఓ కార్యాలయంలోకి అనుమతిస్తారు. అభ్యర్థితోపాటు ఐదుగురిని మాత్రమే ఆర్‌ఓ చాంబర్‌లోకి అనుమతిస్తారు.